మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

www.evarthalu.com

Published from Jagitial
Circulated to Telangana

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం
MONDAY
23-3-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 || సంచిక: 263 Issue: 263

23 మార్చి 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:21 సూర్యాస్తమయం - సా. 6:24 తిథి పంచమి సా. 6:40 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం కృతిక రా. 8:50 వరకు తరువాత రోహిణి యోగం విష్కంభ మ. 12:22 వరకు కరణం బవ ఉ. 7:57 వరకు భాలవ సా. 6:40 వరకు వర్జ్యం ఉ. 9:45 నుండి ఉ. 11:13 వరకు దుర్ముహూర్తం మ. 12:46 నుండి మ. 1:35 వరకు మ. 3:11 నుండి మ. 3:59 వరకు రాహుకాలం ఉ. 7:51 నుండి ఉ. 9:22 వరకు యమగండం ఉ. 10:52 నుండి మ. 12:22 వరకు గుళికాకాలం మ. 1:53 నుండి మ. 3:23 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:45 నుండి తె. 5:33 వరకు అమృత ఘడియలు సా. 6:35 నుండి రా. 8:04 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:58 నుండి మ. 12:46 వరకు



# ఇది మోదీ జమానా..!

## ....8,931 డేస్ ప్లస్ కంటిన్యూ....

ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు
విరామం లేకుండా ప్రభుత్వాధినేతగా పని
2001 నుంచి నేటి వరకు అధికారంలోనే

ప్రధాని మోదీ మరో అరుదైన రికార్డు నెలకొల్పారు. విరామం లేకుండా 8,931 రోజుల పాటు ప్రభుత్వాధినేతగా పని చేసిన వ్యక్తిగా నిలిచారు. ఇప్పటివరకు ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ (8,930 రోజులు) పేరిట ఉంది. తాజాగా ఆయన రికార్డును ప్రధాని మోదీ అధిగమించారు. పవన్ కుమార్ 8,930 రోజుల పాటు సిక్కిం సీఎం హోదాలో ఉన్నారు. మోదీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి హోదాలతో అన్ని రోజుల పదవీకాలాన్ని పూర్తి చేశారు.

న్యూఢిల్లీ: 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 2014లో ప్రధాని అయ్యేవరకు ఆ పదవిలో ఉన్నారు. 2014 నుంచి నేటి వరకు ప్రధానిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో 8,931 రోజుల పాటు ప్రభుత్వాధినేతగా ఉన్నారు. అంతేకాదు గుజరాత్‌కు అత్యధిక కాలం సీఎంగా ఉన్న రికార్డు కూడా మోదీ పేరిటే ఉంది. అలాగే సీఎంగా ఎక్కువ అనుభవం ఉన్న ప్రధాని కూడా మోదీనే. ప్రధాని పదవిలో కొనసాగుతూ కూడా మోదీ పలు రికార్డులను తరువాయి 2 వ పేజీలో...



# అన్న'దాత'ను..!

## రైతుల సంతోషం నా బాధ్యత.. 70 లక్షల మంది రైతులకు 9 వేల కోట్లు

### మహిళలందరినీ కోటీశ్వరులను చేస్తాం.. సిద్దిపేట రైతు ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి



అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా. రైతును ధైర్యంగా సాగు మడిలో నిలబెట్టేందుకు భరోసా ఇస్తున్నా. 70 లక్షల మంది రైతన్నల కోసం రూ.9000 కోట్ల రైతు భరోసా నిధుల విడుదలకు శ్రీకారం చుట్టాం. సిద్దిపేట జిల్లా నర్మెట గ్రామ వేదికగా మరోసారి మా పాలనలో రైతే రాజు అని రుజువు చేస్తూ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఆర్థిక సాయంతో చేతులు దులుపుకోవడం కాదు.. కేవలం 17 నెలల వ్యవధిలో ఆయిల్‌పామ్ పరిశ్రమ మొదలు పెట్టి, పూర్తి చేసి నేడు రైతు లోకానికి అంకితం చేస్తున్నాం. దానికి కొనసాగింపుగా రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్నాం. - సీఎం రేవంత్ రెడ్డి (సిద్దిపేట పర్యటకు వెళ్తూ..)

సిద్దిపేట, మార్చి 22 (ఈవార్తలు): 'ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు' అనే నానుడిని నిజం చేస్తూ తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ రిఫైనరీ ఫ్యాక్టరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న రైతు ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం.. అన్నదాతలకు సాగు పెట్టుబడి సాయం తరువాయి 2 వ పేజీలో...

# నేనుండను!

## ఎల్లుండి కాంగ్రెస్‌కు టాటా చెప్తా

### పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తా.. మాజీమంత్రి జీవన్ రెడ్డి స్పష్టీకరణ

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. ఈ నెల 25న (బుధవారం) కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. అవమానాలు భరిస్తూ తాను ఇక కాంగ్రెస్ పార్టీలో ఉండలేనని తేల్చి చెప్పారు. రాజీనామా తర్వాత తన భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని తెలిపారు. ఈ మేరకు రాజీనామాకు గల కారణాలను కార్యకర్తలకు వివరిస్తూ ఆదివారం లేఖ విడుదల చేశారు.



జగిత్యాల, మార్చి 22 (ఈవార్తలు): 'నాలుగు దశాబ్దాలకుపైగా నాతో కలిసి ప్రయాణం చేసిన రాజకీయ సహచరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులకు.. గత 20 నెలల నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను మీరు గమనిస్తున్నారు. ఈ పరిస్థితులలో ఇంకనూ అవమానాలకు గురి అవుతూ, మానసిక క్షోభతో, కాంగ్రెస్ పార్టీలో కొనసాగటం సాధ్యంకాని పరిస్థితులలో 2026, మార్చి 25 రోజున భవిష్యత్ ప్రణాళిక కోసం జగిత్యాల పట్టణంలోని గొల్లపల్లి రోడ్డు బండారి గార్డెన్‌లో ఉదయం 10:00 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని, మీ సలహాలు, సూచనలతో, భవిష్యత్, రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, అందదండలతో, వాకు మానసిక స్థైర్యం కలిగిస్తూ, మార్గదర్శకం కాగలరని తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,597 |
| వెండి (గ్రాము): | రూ.250 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,794 |

# అదిగో అణు యుద్ధం!

## అణు కేంద్రాలపై దాడులు హేయం

### ప్రమాదకర దశకు గల్ఫ్ యుద్ధం... డబ్ల్యూహెచ్‌వో తీవ్ర ఆందోళన

పశ్చిమాసియాల్నో యుద్ధం అత్యంత భయంకరమైన , ప్రమాదకరమైన దశకు చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ ఘెబ్రేయేసస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌లోని నతాన్జ్ అణు కేంద్రం, ఇజ్రాయెల్‌లోని దిమోనా అణు సదుపాయం ఉన్న నగరంపై దాడులు జరిగినట్లు వచ్చిన నివేదికలతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కిందని పేర్కొన్నారు.

జెనీవా: ఈ ఘటనలపై అంతర్జాతీయ అణు ఇంధ న సంస్థ ప్రస్తుతం లోతైన దర్యాప్తు చేస్తోందని, ప్రస్తు తానికి రేడియేషన్ స్థాయుల్లో ఎలాంటి అసాధారణ పెరుగుదల నమోదు కానప్పటికీ, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడం ప్రజారోగ్యానికి , పర్యావరణా నికి కోలుకోలేని పెను ముప్పును సృష్టిస్తుందని హెచ్చరించారు. యుద్ధం శాంతిని తీసుకురాదని, రాబోయే తరాలకు ద్వేషించడానికి కొత్త కారణాలను మాత్రమే నేర్పుతుందని వ్యాఖ్యానిస్తూ, అన్ని పక్షాలు అత్యంత సైనిక సంయమనం పాటించాలని, శాంతే అన్నిటికీ ఉత్తమ ఔషధమని పిలుపునిచ్చారు. సాధ్యమైన అణు ప్రమాదాలను తరువాయి 2 వ పేజీలో...





# ఇజ్రాయెల్‌కు 'అణు'కు!

### క్షిపణి దాడులతో విరుచుకుపడ్డ ఇరాన్

### డిమోనా, అరద్ అణు కేంద్రాలే టార్గెట్

### ఘటనలో 100 మందికి పైగా క్షతగాత్రులు

జెరూసలేం: ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులతో విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ అణు పరిశోధన కేంద్రం సమీపంలోని డిమోనా, అరద్ ప్రాంతాలపై ఇరాన్ క్షిపణులతో దాడి చేసింది. అయితే, డిమోనా ప్రాంతంలో ఇజ్రాయెల్‌కు కీలకమైన అణు కేంద్రం ఉండటం వల్ల భద్రతా ఆందోళనలు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



థాయిలాండ్ అంటేనే పర్యాటకం. అక్కడి బీచ్‌ల ద్వారా భారీ ఆదాయాన్ని పొందుతోంది అక్కడి ప్రభుత్వం. అయితే, అక్కడి పగడపు దిబ్బలు దెబ్బతినడంతో అవి సహజంగా పునర్నిర్మితం అయ్యేందుకు 2018లో పలు బీచ్‌లను మూసేశారు. 2022లో తిరిగి తెరిచి, కఠిన నిబంధనలు అమలు చేసి, పగడపు దిబ్బలను కాపాడుతున్నారు.



# పెట్రో సంగతేంది?

### ఇంధర సరఫరా ఎలా ఉంది?.. చమురు కొరత రాకుండా ఏం చేద్దాం?

### కేంద్ర మంత్రులతో ప్రధాని మోదీ చర్చలు.. ఇరాన్ యుద్ధ పరిస్థితులపై సమీక్ష

న్యూఢిల్లీ: ప్రస్తుతం పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్, అమెరికా కలిసి ఇరాన్‌పై భీకర దాడులు చేస్తుండగా.. ఇరాన్ కూడా ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై తమదైన శైలిలో దాడులు చేస్తోంది. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రపంచ చమురు రవాణాకు కీలకంగా ఉన్న హర్మూజ్ జలసంధి ఇరాన్ ఆధీనంలో ఉండగా.. అక్కడి నుంచి చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో భారత్ సహా ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతోంది. దీంతో ఆయా దేశాల్లో దారుణమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. మన దేశంలోనూ గ్యాస్ తరువాయి 2 వ పేజీలో...



## అరుణాచలం లడ్డూ తయారీ

# నిలిపివేత

అరుణాచలం, మార్చి 22 (ఈవార్తలు): గ్యాస్ కొరత ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం ఆలయాన్ని సైతం తాకింది. పశ్చిమాసియా యుద్ధం ఎఫెక్ట్ వల్ల ఇండియాలో గ్యాస్ కొరత ఏర్పడింది. దీంతో ఆలయంలో ఉచిత లడ్డూ ప్రసాద పంపిణీని నిలిపివేశారు. ఇక్కడ భక్తులకు లడ్డూను ఉచితంగా తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

23.3.2026

మేషం: రావలసిన బకాయిలు సకాలంలో అందవు. ఖర్చు అధికంగా ఉంటుంది. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఋణ ప్రయత్నాలు కలసిరావు. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. ఉద్యోగమున స్థానచలన సూచనలున్నవి. ఇతరులతో అనుకోని విభేదాలు కలుగుతాయి.

వృషభం: స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. దూర ప్రయాణాలలో ఆర్థిక లాభం కలుగుతుంది. ఉద్యోగమున అధికారుల అనుగ్రహంతో ఉన్నత హోదాలు పొందుతారు. ముఖ్యమైన పనులలో స్వంత ఆలోచనలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

మిధునం: బంధు మిత్రుల ఆగమనంతో గృహమున సందడి వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించి గౌరవ మర్యాదలు పెంచుకుంటారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. నిరుద్యోగుల అంచనాలు ఫలిస్తాయి. ఉద్యోగమున పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

కర్కాటకం: అన్ని వైపుల నుండి ఆదాయం అందుతుంది. శత్రుపరమైన సమస్యల నుండి బయటపడతారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తవుతాయి. గృహమున శుభకార్య ప్రస్తావన వస్తుంది. వృత్తి ఉద్యోగ విషయంలో సహోద్యోగుల సహాయం లభిస్తుంది.

సింహం: ఉద్యోగమున అదనపు బాధ్యతలు నిర్వహించడంలో లోపాలు కలుగుతాయి. గృహ వాతావరణం కొంత చికాకులు తప్పవు. నిరుద్యోగుల కష్టం వృధాగా మిగులుతుంది. సంతాన విద్యా, ఉద్యోగ విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు.

కన్య: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణాలు కలసివస్తాయి. ముఖ్యమైన వ్యవహారంలో సన్నిహితుల సహాయం అందుతుంది. ఆర్థిక పరంగా ఇబ్బందులున్నా సౌకర్యాలకు లోటు ఉండదు. ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి సంభందిత వివాదాలు పరిష్కారమౌతాయి.

తుల: పాత మిత్రులతో కొన్ని ముఖ్యమైన విషయాలు చర్చిస్తారు. ఆర్థిక పరమైన అనుకూలత పెరుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. చేపట్టిన పనులలో అవరోధాలు తొలగుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాల లాభిస్తాయి. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

వృశ్చికం: ఇతరులకు సైతం సహాయ సహకారాలు అందిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు. ఖర్చుకు తగిన ఆదాయం అందుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగమున అధికారుల సహాయంతో నూతన పదవులు పొందుతారు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

ధనస్సు: ఉద్యోగ ప్రయత్నాలలో అవరోధాలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణాల వలన శారీరక శ్రమ తప్పదు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. జీవిత భాగస్వామితో పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. సన్నిహితుల నుండి ధన ఒత్తిడి పెరుగుతుంది.

మకరం: కొన్ని వ్యవహారములలో కుటుంబ సభ్యుల సలహాలు కలిసివస్తాయి. చేపట్టిన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. దూర ప్రాంత బంధు మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సంతానానికి నూతన విద్యావకాశములు లభిస్తాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి.

కుంభం: చేపట్టిన పనులలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. బంధు మిత్రులతో స్వల్ప విరోధాలు కలుగుతాయి. దీర్ఘ కాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చోటు చేసుకుంటాయి. వ్యాపారమున భాగస్థుల ప్రవర్తన వలన శిరోభాధలు తప్పవు. వృత్తి ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి.

మీనం: పాత మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. ఆత్మీయుల నుండి వివాదాలకు చెందిన కీలక సమాచారం అందుతుంది. నిరుద్యోగులకు శుభ వర్తమానాలు అందుతాయి. వ్యాపారమున నూతన ఆలోచనలు అమలు చేస్తారు. ఆర్థికంగా పురోగతి కలుగుతుంది.



# అన్న'దాత'ను..!

మొదటి పేజీ తరువాయి

కింద రూ. 3,600 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ నిధులు సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రేపటికల్లా జమ అవుతాయని, మిగిలిన వారికి కూడా మరో 45 రోజుల్లో రైతు భరోసా అందుతుందని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనతో పోలిస్తే తమ ప్రభుత్వం రైతులకు రెట్టింపు సాయం అందిస్తోందని సీఎం గణాంకాలతో వివరించారు. కేసీఆర్ హయాంలో నెలకు సగటున రూ. 2,533 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెలా రూ. 5,500 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. గత 28 నెలల కాలంలో రైతుల కోసం ఏకంగా లక్షా 40 వేల కోట్లు ఖర్చు చేశామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెట్టిన రైతులకు అభినందనలు తెలుపుతూ, పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో పసుపు వంటి పంటలకు ధరలు మారుతున్న నేపథ్యంలో రైతులు సాంప్రదాయ పంటల నుండి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయడమే లక్ష్యమని, ఇందుకోసం తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కూడా పామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. వ్యవసాయ రంగంలో సాంకేతికతను పెంచేందుకు ఇక్రిశాట్ వంటి సంస్థల సేవలను వినియోగించుకుంటామని, పంట మార్పిడిపై చర్చించేందుకు త్వరలోనే కేంద్ర మంత్రులతో కలిసి ప్రధానిని కలుస్తామని చెప్పారు. "నిజామాబాద్‌లోని అంకాపూర్ గ్రామంలాగా తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం" అని ఆయన ఆకాంక్షించారు. రైతులతో పాటు మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం పేర్కొన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం నెలకు రూ. 350 కోట్లు ఖర్చు చేస్తున్నామని, వారిని ఆర్టీసీ బస్సులకు యజమానులను చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. మహిళా సంఘాల సభ్యుల సంఖ్యను 65 లక్షల నుండి కోటి మందికి పెంచి, వారిని కోటీశ్వరులుగా మార్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదానీ, అంబానీలతో పోటీపడి మహిళలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తామని, మహిళలకు పెట్రోల్ బంకుల కేటాయింపు వంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే ఉగాది నాటికి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామని, తనను ఆశీర్వదించడానికి వచ్చిన అక్కాచెల్లెళ్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈ ఏడాది నుండి 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' నిర్వహిస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. "నాకు అన్నీ తెలుసు అని అహంకారంతో పోను.. తెలియనిది అడిగి తెలుసుకుంటాను. ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందడమే నిజమైన బంగారు తెలంగాణ' అని పేర్కొన్నారు.





# నేనుండను!

మొదటి పేజీ తరువాయి

మనవి' అని లేఖలో పేర్కొన్నారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు పార్టీ, ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో జీవన్ రెడ్డి అలకబూనారు. ఈ పరిణామాలతో ఆయన పార్టీకి రాజీనామా చేయాలని డిసైడ్ అయ్యారు. దీంతో జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగింది. ఈ మేరకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ స్వయంగా జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. పార్టీ వీడొద్దని.. అధిష్టానంతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని జీవన్ రెడ్డికి చెప్పారు. కానీ పార్టీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో జీవన్ రెడ్డి మాత్రం మనసు మార్చుకోలేదు. ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తానని ప్రకటించారు.

### కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి?

మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు ముహూర్తం ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. జీవన్ రెడ్డి ఏప్రిల్ ఐదో తేదీన బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు సమాచారం. తాజాగా అందుతున్న సమాచారం మేరకు.. ఏప్రిల్ ఐదో తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు తెలుస్తోంది.

# ఇజ్రాయెల్‌కు 'అణు'కు!

మొదటి పేజీ తరువాయి

పెరిగాయి. ఇక, ఈ ఘటనలో పిల్లలు సహా 100మందికి పైగా గాయపడినట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ స్పందించింది. ఇరాన్ క్షిపణులు నేరుగా పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడి చేశాయని పేర్కొంది. దీని వల్ల అరుద్, డిమోనా ప్రాంతాలు ధ్వంసమయ్యాయని, 100 మందికిపైగా గాయపడ్డారని తెలిపింది. దీనిని ఉగ్రవాద చర్య, యుద్ధ నేరంగా అభివర్ణించింది. ఇరాన్ క్షిపణి దాడిపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు తీవ్రంగా స్పందించారు. పౌర నివాసాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. ఐరోపాలోనికి చొచ్చుకుపోయే సామర్థ్యం ఇరాన్‌కు ఉందని, ప్రపంచాన్ని ఆ దేశం ప్రమాదంలో పడేస్తోందనడానికి ఇదే సాక్ష్యమన్నారు. ఇజ్రాయెల్‌లోని అరాద్ నగరంలో ఇరాన్ క్షిపణి దాడి చేసిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో అన్ని దేశాల తరఫున అమెరికా, ఇజ్రాయెల్‌లు కలిసి పోరాడుతున్నాయన్నారు. 'పౌర నివాసాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోంది. వీటిలో అదృష్టవశాత్తు ఎవరూ చనిపోలేదు. కానీ వారి ఉద్దేశం సామాన్య పౌరుల్ని చంపడమే. మేమూ దాడులు చేస్తున్నాం.. కానీ పౌరులను లక్ష్యంగా చేసుకోలేదు. ఇరాన్ పాలకులు, నేతలు, నేర ముఠాలనే టార్గెట్ చేస్తున్నాం' అని నెతన్యాహు పేర్కొన్నారు. ఇరాన్ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడాన్ని ప్రస్తావిస్తూ.. వీటితో ఐరోపాకు ఎంతో ముప్పు ఉందన్నారు. సైప్రస్‌పై ఇప్పటికే దాడి చేసిందని, వారు అందర్నీ లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. అంతర్జాతీయ ఇంధన సరఫరాకు కీలకంగా ఉన్న సముద్ర మార్గాన్ని (హర్మూజ్‌ను) అడ్డుకుంటూ యావత్ ప్రపంచాన్ని బ్లాక్‌మెయిల్ చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తోందని నెతన్యాహు ఆరోపించారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా కొందరు అడుగులు వేయడం సంతోషంగా ఉందని, అయినప్పటికీ.. ఇంకా చాలా అవసరమని అన్నారు. అలాగే, దాడి జరిగిన ప్రాంతం నుంచి సుమారు 150 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్‌పై దాడుల నేపథ్యంలో ఇరాన్ ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ అధిపతి మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ మూసావి స్పందించారు. ఇజ్రాయెల్ గగనతలం రక్షణ లేకుండా ఉంది. ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాల ఆకాశంపై ఇరాన్ మిసైల్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఇకపై జరగబోయే దాడులు అమెరికా-ఇజ్రాయెల్ కమాండర్లను ఆశ్చర్యపరుస్తాయని అన్నారు. కొత్త వ్యూహాలతో ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు.

# అదిగో అణు యుద్ధం!

మొదటి పేజీ తరువాయి

ఎదుర్కోవడానికి ఇప్పటికే 13 దేశాల్లో తమ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు కూడా వెల్లడించారు.

### 48 గంటల్లోగా హార్మూజ్ తెరవాల్సిందే: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో ఇరాన్‌కు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిపై ఇరాన్ విధిస్తున్న ఆంక్షల పట్ల ఆయన నిప్పులు చెరిగారు. వచ్చే 48 గంటల్లోగా జలసంధిని పూర్తిగా తెరిచి, నౌకల రాకపోకలకు అనుమతించకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలే లక్ష్యంగా భీకర దాడులు చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఆయన ఓ సంచలన పోస్ట్ చేశారు. 'సరిగ్గా 48 గంటల సమయం ఇస్తున్నాం. ఈలోగా హార్మూజ్ జలసంధిని ఎలాంటి బెదిరింపులు లేకుండా యథాతథ స్థితికి తీసుకురావాలి. ఒకవేళ జలసంధి తెరవకుంటే.. ఇరాన్‌లోని ప్రధాన విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా భీకర దాడులు చేస్తుంది' అని హెచ్చరించారు. ఒకవేళ దాడులు గనుక మొదలైతే.. ఇరాన్‌లో ఉన్న అన్నింటికంటే అతిపెద్ద విద్యుత్ కేంద్రమే తమ మొదటి టార్గెట్ అని ట్రంప్ కుండబద్దలు కొట్టారు.

# ఇది మోదీ జమానా..!

మొదటి పేజీ తరువాయి

నెలకొల్పారు. స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర తొలి నేతగా మోదీ నిలిచారు. కేంద్రంలో రెండు సార్లు పదవీ కాలాన్ని పూర్తి చేసుకుని మూడోసారి అధికారం చేపట్టిన తొలి కాంగ్రెసేతర నేతగా కూడా రికార్డు సృష్టించారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత భారతదేశానికి అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న రెండో నేత కూడా మోదీనే.

# అరుణాచలం లడ్డూ తయారీ నిలిపివేత

మొదటి పేజీ తరువాయి

పంపిణీ చేస్తుంటారు. అయితే ఆయలంలో గ్యాస్ కొరత ఎక్కువ కావడంతో లడ్డూ పంపిణీ చేయలేమని నిర్వాహకులు తెలిపారు. కాగా, భక్తుల కోరిక మేరకు కట్టెల పొయ్యిపై లడ్డూ తయారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోరామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కట్టెల పొయ్యిపై తయారు చేసి పంపిణీ చేస్తామని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

# పెట్రో సంగతేంది?

మొదటి పేజీ తరువాయి

కొరత తలెత్తగా.. ఇటీవల పలు నౌకలు పోర్టులకు చేరడంతో కాస్త ఉపశమనం కలిగింది. అయితే యుద్ధం ఇప్పట్లో ఆగే పరిస్థితులు కనిపించకపోవడంతో.. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత దారుణంగా తయారయ్యే అవకాశాలు ఉన్నాయనే భయాలు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అలర్ట్ అయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో పలువురు సీనియర్ మంత్రులతో కీలక సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. దేశంలో గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తులు, ముడి చమురు, ఎరువుల లభ్యత, విద్యుత్ రంగాలు ప్రస్తుతం ఎలా ఉన్నాయి అనే దానికి సంబంధించి సమీక్ష చేపట్టారు. దేశంలో నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేయడం.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరకు రవాణా చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ ఉన్నత స్థాయి కేబినెట్ భేటీకి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, జేపీ నడ్డా, అశ్వినీ వైష్ణవ్, హర్దీప్ సింగ్ పురీ, రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. వీరితోపాటు జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ ధోవల్ సహా వివిధ శాఖలకు సంబంధించిన కీలక ఉన్నతాధికారులు పాల్గొన్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ పరిస్థితులను సమీక్షించడంతోపాటు.. పెట్రోలియం ఉత్పత్తులు సహా దేశంలో నిత్యావసరాల సరఫరాకు అంతరాయం లేకండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని అధికార వర్గాలు తెలిపాయి.



# మత్తు డాక్టర్‌కు మతి పోగొట్టారు!

**ఎనస్తీషియా డాక్టర్‌కు సైబర్ టోకరా.. ఒక్క కాల్ తో రూ.10 లక్షలు స్వాహా**

హైదరాబాద్, మార్చి 22 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో ఎనస్తీషియన్‌గా పనిచేస్తున్న ఓ డాక్టర్ సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి రూ.10.15 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడికి ఆస్ట్రేలియాలోని ప్రముఖ ఫియోనా స్టాన్లీ ఆస్పత్రిలో ఉద్యోగం ఉందంటూ నిందితులు మొదట ఈమెయిల్ పంపారు. అనంతరం నిందితులు బాధితుడికి ఇంటర్వ్యూ కాల్ చేసి, ఆయన ఉద్యోగానికి ఎంపికయ్యారని నమ్మించారు. అందుకు తగ్గట్టుగానే నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌ను కూడా పంపారు. తమను తాము అమెరికన్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ప్రతినిధులుగా పరిచయం చేసుకున్న నేరగాళ్లు.. వీసా ప్రాసెసింగ్, రిజిస్ట్రేషన్ ఫీజులు, సెక్యూరిటీ డిపాజిట్ అంటూ వివిధ కారణాలతో బాధితుడి నుంచి విడతల వారీగా రూ.10లక్షల15వేలు వసూలు చేశారు. డబ్బులు పంపిన తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో, తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# ఎమ్మెల్యేను ఏమార్చి దోచేశారు!

**ఆర్టీఏ చలాన్ పేరుతో లింక్.. ఓపెన్ చేస్తే రూ.12 లక్షలు మాయం**




పోలవరం, మార్చి 22 (ఈవార్తలు): సైబర్ నేరగాళ్ల బారిన సామాన్యులే కాదు, ప్రజాప్రతినిధులు కూడా పడుతున్నారనే మరో ఘటన వెలుగుచూసింది. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును సైబర్ కేటుగాళ్లు మోసం చేసి భారీగా నగదు దోచుకెళ్లారు. అధికారిక సమాచారం ప్రకారం, ఆర్టీఏ చలానా పేరుతో వచ్చిన ఓ యాప్ లింక్‌ను ఎమ్మెల్యే క్లిక్ చేయడంతో ఈ మోసం జరిగింది. తెలియక ఆ లింక్ ఓపెన్ చేసిన వెంటనే ఆయన బ్యాంక్ ఖాతా నుంచి ఏకంగా రూ.12 లక్షలు మాయమైనట్లు వెల్లడైంది. జంగారెడ్డిగూడెంలో ఉన్న ఇండస్ ఇండ్ బ్యాంక్ ఖాతా నుంచి ఈ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు తస్కరించినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే పోలీసులను ఆశ్రయించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ క్రాంతికుమార్ దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. అపరిచిత లింక్‌లు, యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచిస్తున్నారు. బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోరాదని, అనుమానాస్పద మెసేజ్‌లు వచ్చినప్పుడు వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. సైబర్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు.

# మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు **94404 55811** నంబర్‌ను సంప్రదించవచ్చు.

# బెంగాల్‌లో పోటీ చేస్తాం

**అసదుద్దీన్ కీలక ప్రకటన**

హైదరాబాద్, మార్చి 22 (ఈవార్తలు): బెంగాల్ ఎన్నికల్లో పోటీపై ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కీలక ప్రకటన చేశారు. హుమాయున్ కబీర్ నేతృత్వంలోని జనతా ఉన్నయన్ పార్టీతో కలిసి పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేస్తుందని ప్రకటించారు. ఈ నెల 25న కోల్‌కతాలో కబీర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని తెలిపారు. పొత్తుపై ప్రకటన చేసిన ఓవైసీ.. సీట్ షేరింగ్ గురించి మాత్రం ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. హుమాయున్ కబీర్ ఎవరంటే.. భరత్‌పూర్ ఎమ్మెల్యే. టీఎంసీ బహిష్కృ నేత. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో బాబ్రీ మసీదు నమూనాలో కొత్త మసీదు నిర్మాణం చేపట్టడంతో అతడిని టీఎంసీ సస్పెండ్ చేసింది. దీంతో జనతా ఉన్నయన్ పేరుతో గతేడాది డిసెంబర్□లో హుమాయున్ కబీర్ కొత్త రాజకీయ పార్టీ స్థాపించాడు. టీఎంసీకి పోటీగా త్వరలో జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎంతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పోటీకి సిద్ధమయ్యారు. గతంలో టీఎంసీ నుంచి తాను గెలిచిన భరత్‌పూర్ స్థానం నుంచి కబీర్ మళ్లీ బరిలోకి దిగుతున్నాడు. దీంతో పాటు ముర్షిదాబాద్ జిల్లాలోని రెజినగర్, నౌడా అనే రెండు నియోజకవర్గాల నుంచి కూడా అతడు పోటీ చేయనున్నాడు. కాగా, 294 మంది సభ్యులు గల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి 2026, ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. లక్ష్యంగా టీఎంసీ, బీజేపీ తీవ్రంగా పోటీ పడుతున్నాయి.

# డీగో గార్సియా దీవిపై దాడి చేయలేదు

మా క్షిపణి పరిధి 2 వేల కిలోమీటర్లే: ఇరాన్

టెహ్రాన్: అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, హిందూ మహాసముద్రంలోని అమెరికా-బ్రిటన్ సంయుక్త సైనిక స్థావరం డీగో గార్సియాపై క్షిపణి దాడికి ప్రయత్నించామన్న ఆరోపణలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని ఓ ఇరాన్ సీనియర్ అధికారి అల్ జజీరాకు స్పష్టం చేశారు. తమ క్షిపణుల పరిధి 2 వేల కిలోమీటర్లేనని ఉద్ఘాటించారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని డీగో గార్సియా లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వాటిలో ఒకటి సాంకేతిక లోపంతో గాల్లోనే విఫలమవ్వగా, మరొకదాన్ని అమెరికా యుద్ధనౌక అడ్డుకున్నట్లు సమాచారం.

# స్కిల్స్ వర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ కాలేజీలు

**ఐటీఐలు కూడా.. రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**




హైదరాబాద్, మార్చి 22 (ఈవార్తలు): తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి విద్యలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (గతంలో ఐటీఐలు) తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏకీకరణతో నైపుణ్య శిక్షణకు సంబంధించిన అన్ని సంస్థలు ఒకే గొడుగు కిందకు రానున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 113 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు స్కిల్స్ వర్సిటీ కిందకు రానున్నాయి. దీని ఫలితంగా, ఇప్పటివరకు ఈ కాలేజీల సిలబస్, పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) రద్దు కానుంది. అదేవిధంగా, కార్మిక శాఖ పరిధిలోని 63 ప్రభుత్వ ఏటీసీలు, 219 ప్రైవేట్ ఐటీఐలు కూడా ఈ వర్సిటీ పరిధిలోకి చేరనున్నాయి. ఈ సమగ్ర మార్పుల్లో భాగంగా, ఇప్పటివరకు పరిశ్రమల శాఖ కింద ఉన్న స్కిల్స్ యూనివర్సిటీని ఇకపై ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ విద్యా కమిషన్ అందించిన 'విద్యా విధానం-2026' సిఫార్సులకు అనుగుణంగా ఈ ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు, ఇంటర్మీడియట్ స్థాయిలోని ఒకేషనల్ కోర్సులు, విదేశాల్లో ఉపాధి కల్పించే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టీఓఎమ్‌సీఓఎమ్) కూడా ఈ నూతన వ్యవస్థలో భాగం కానున్నాయి. ఈ సంస్కరణల ద్వారా సిలబస్ రూపకల్పనలో పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది ఆగస్టులో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి దీనికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తుండగా, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ వర్సిటీ కోసం, ఫ్యూచర్ సిటీలో 58 ఎకరాల్లో శాశ్వత ప్రాంగణాన్ని నిర్మిస్తున్నారు. ఈ అధికార బదిలీ, విలీన ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్పులతో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.

# ఇద్దరు మంత్రులు అవుట్!?

**త్వరలో మంత్రి వర్గ విస్తరణ.. కేబినెట్‌లోకి కొత్త ముఖాలు!**

హైదరాబాద్, మార్చి 22 (ఈవార్తలు): రాష్ట్ర కేబినెట్‌లో మార్పులు జరగనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన విషయంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కేబినెట్‌లో కొనసాగుతున్న మంత్రుల్లో ఒకరు, లేదా ఇద్దరిని తప్పించి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ప్రమోషన్లు ఇచ్చి పార్టీలో ఉన్నత పదవులు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఏ సామాజిక వర్గ మంత్రిని తొలగిస్తున్నారో.. కొత్తగా అవకాశం కల్పించే వారిని కూడా అదే సామాజిక వర్గం నుంచి తీసుకురావాలని తెలుస్తోంది. ఇక మంత్రివర్గం నుంచి తీసేసిన వారిని వారి సీనియారిటీని ఆధారంగా చేసుకుని.. సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి ఆయా మంత్రులకు ఇప్పటికే పార్టీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అందుకు ఆ నేతలు కూడా సానుకూలంగానే అంగీకరించినట్లు హస్తం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రులను తప్పించడంతోపాటు.. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మరో 2 మంత్రి పదవులను కూడా భర్తీ చేసేందుకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు చేసేందుకు ఆయా జిల్లాల ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావిస్తోంది. కేబినెట్ విస్తరణపై పార్టీలో అంతర్గత వివాదాలు రాకుండా ఉండేందుకు పక్కాగా ప్రణాళికలు చేస్తోంది. తప్పించిన మంత్రుల స్థానాలను అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతోనే భర్తీ చేయాలనే నిర్ణయించినట్లు సమాచారం. ఇక మంత్రి పదవుల నుంచి తప్పించిన వారు.. అవమానంగా భావించకుండా ఉండేందుకు.. వారికి ఉన్నత పదవులు ఇచ్చి హైకమాండ్ భావిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. అలాంటి వారికి పార్టీలో కీలకమైన, గౌరవప్రదమైన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ఇందులో భాగంగానే బీసీల్లో సంఖ్యాబలం ఎక్కువ ఉన్న మున్నూరు కాపులు, ఎస్టీల్లో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ నేతల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈసారి శాసనమండలి నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు సమాచారం. కేబినెట్‌లో మార్పుల సందర్భంగానే చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ఇందులో భాగంగానే అసెంబ్లీ, మండలి విప్‌ల నియామకాలు ఇటీవలె చేపట్టినా.. చీఫ్ విప్ నియామకాలను మాత్రం వాయిదా వేసినట్లు చర్చ జరుగుతోంది. మంత్రి పదవి రాని సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా ఉండే చీఫ్ విప్ పదవి ఇవ్వాలని భావిస్తున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తున్నట్టు గతేడాది జూన్‌లో ప్రకటించగా.. తనకు ఆ పదవి ఇష్టం లేదని.. మంత్రి పదవి కావాలని ఆయన కాంగ్రెస్ పెద్దలకు తేల్చి చెప్పేశారు.

# శ్లాబు కూలి ఇద్దరు ఎలక్ట్రీషియన్లు మృతి

బేగంపేట-హైదరాబాద్, మార్చి 22 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బేగంపేటలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. ఓ అపార్ట్‌మెంట్‌లోని బాల్కనీ శ్లాబు కూలిపోవడంతో ఇద్దరు ఎలక్ట్రీషియన్లు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కుందన్‌బాగ్, మెథడిస్ట్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, మూడో అంతస్తులోని తన ఫ్లాట్‌లో ఎలక్ట్రికల్ పనుల కోసం ఇంటి యజమాని దివాకర్ ప్రసాద్ ఇద్దరు ఎలక్ట్రీషియన్లను పిలిపించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన దేవిదాస్ (56), వివేక్ (32) పనులు చేస్తుండగా, యజమాని దివాకర్ బాల్కనీలో నిల్చుని ఉన్నారు. ఈ క్రమంలో బాల్కనీ శ్లాబు ఒక్కసారిగా కూలిపోవడంతో ముగ్గురూ కిందపడిపోయారు. ఈ దుర్ఘటనలో దేవిదాస్, వివేక్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన దివాకర్ ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బంజారాహిల్స్‌లో ఏపీ ఎంపీ సీఎం రమేశ్ హల్ చల్

బంజారాహిల్స్-హైదరాబాద్, మార్చి 22 (ఈవార్తలు): ఏపీలోని అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ హైదరాబాద్‌లో కలకలం సృష్టించారు. నగరంలోని బంజారాహిల్స్‌లో ఉన్న ఓ వివాదాస్పద స్థలం వద్ద ఆయన హంగామా చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వెనుక ఉన్న ఆనంద్ ప్రభాత్ సొసైటీ స్థలంపై కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఆదివారం ఉదయం సీఎం రమేశ్ తన అనుచరులతో కలిసి ఈ స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఉన్నవారిని ఉద్దేశిస్తూ, "వీడియో తీయ్" అంటూ తన సిబ్బందిని ఆదేశిస్తున్న దృశ్యాలు బయటకు వచ్చిన వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆయన రాకతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ వివాదం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ వరకు చేరినట్లు సమాచారం. అయితే, సీఎం రమేశ్ ఆ స్థలానికి ఎందుకు వెళ్లారు? ఈ ఘటనపై ఎవరైనా ఫిర్యాదు చేశారా? అనే పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

# బిల్డింగ్ రూల్స్‌లో కొత్త మార్పులు

**టీడీఆర్‌పై తాజా గైడ్‌లైన్స్ జారీ**

హైదరాబాద్, మార్చి 22 (ఈవార్తలు): తెలంగాణలో భవన నిర్మాణ నిబంధనలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) వినియోగంపై కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు 21 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను ఇకపై హైరైజ్‌గా పరిగణించనున్నట్లు స్పష్టం చేసింది. నిర్మాణ రంగంలో పారదర్శకత, క్రమబద్ధీకరణ లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం 2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 40 అడుగుల రోడ్డు వద్ద 3 అంతస్తులు, 60 అడుగుల రోడ్డు వద్ద 4, 80 అడుగుల రోడ్డు వద్ద 5 అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. అయితే, 10 అంతస్తులు దాటిన భవనాలకు టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేసింది. 20 అంతస్తులు దాటిన భవనాలకు 5 శాతం టీడీఆర్ లోడింగ్ కల్పించారు. 750 నుంచి 2000 చదరపు మీటర్ల ప్లాట్లలో నిర్మించే 18 నుంచి 21 మీటర్ల ఎత్తున్న భవనాలకు టీడీఆర్ వాడకాన్ని తప్పనిసరి చేశారు. నాన్ హైరైజ్ భవనాలకు టీడీఆర్ ద్వారా సెట్‌బ్యాక్‌లో సడలింపులు ఇవ్వగా, హైరైజ్ భవనాల్లో 10 శాతం వరకు సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌కు అనుమతించారు. భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసే సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీకి ముందు చెల్లించాల్సి ఉంటుందని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మార్పులు నిర్మాణ రంగంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.

# విప్లవ వీరుల అమరత్వం.. ఆశయాల వారసత్వం



భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో మార్చి 23వ తేదీ కేవలం ఒక క్యాలెండర్ పేజీ కాదు; అది ధైర్యానికి, త్యాగానికి చిరునామా. 1931లో ఇదే రోజున భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులు చిరునవ్వుతో ఉరికంబాన్ని ముద్దాడారు. వారి బలిదానం దేశవ్యాప్తంగా నిద్రాణమై ఉన్న జాతీయతను తట్టిలేపి, బ్రిటిష్ సామ్రాజ్య పునాదులను కదిలించింది. 1931 మార్చి 23న లాహోర్ జైలులో బ్రిటిష్ పాలకులు ఈ ముగ్గురిని ఉరితీశారు. కానీ వారు చిందించిన రక్తపు చుక్కలు కోట్లాది మంది భారతీయుల్లో స్వతంత్ర కాంక్షను రగిలించాయి. కేవలం 23 ఏళ్ల ప్రాయంలోనే మాతృభూమి విముక్తి కోసం నవ్వుతూ ఉరికంబం ఎక్కిన భగత్ సింగ్ ధైర్యం అసాధారణమైనది. వారి పోరాటం కేవలం అధికారాన్ని మార్చడం కోసం కాదు, దోపిడీ లేని సమాజ స్థాపన కోసం. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదం నాటి యువతను ఉర్రూతలూగించింది. నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవడానికి వారి ఆశయాలే దిక్సూచి. 2026 షహీద్ దివస్ ఇతివృత్తం 'మై భారత్, మై రెస్పాన్సిబిలిటీ' (నా భారత్, నా బాధ్యత). ఇది ప్రతి పౌరుడు దేశాభివృద్ధిలో తమ వంతు బాధ్యతను గుర్తించాలని గుర్తుచేస్తోంది. భగత్ సింగ్ ఆశయాలు కేవలం బ్రిటిష్ పాలకులను వెళ్లగొట్టడానికే పరిమితం కాలేదు. ఆయన ఒక గొప్ప మేధావి, దార్శనికుడు. మనిషిని మనిషి దోపిడీ చేయని సమాజం రావాలని కలలుగన్నారు. కేవలం తెల్ల దొరల స్థానంలో నల్ల దొరలు రావడం వల్ల సామాన్యుడి బతుకు మారదని, వ్యవస్థలో సమూల మార్పు రావాలని ఆయన ఆకాంక్షించారు. విప్లవం అంటే కేవలం రక్తపాతం కాదు, అది సమాజంలో రావాల్సిన గుణాత్మక మార్పు అని భగత్ సింగ్ నమ్మారు. బాంబులు, పిస్తోళ్లు విప్లవాన్ని తీసుకురావు.. విప్లవపు కత్తికి ఆశయాల సాన పట్టాలి అన్న ఆయన మాటలు నేటికీ స్ఫూర్తిదాయకం. అసెంబ్లీలో బాంబులు విసిరినప్పుడు కూడా ఎవరినీ చంపాలన్నది వారి ఉద్దేశ్యం కాదు, చెవిటి వారికి వినిపించేలా నిరసన తెలపడమే వారి లక్ష్యం. నేటి యువత భగత్ సింగ్ నుంచి నేర్చుకోవాల్సింది కేవలం దేశభక్తి మాత్రమే కాదు, నిరంతర అధ్యయనం, ప్రశ్నించే తత్వం. జైలు గోడల మధ్య ఉన్నప్పుడు కూడా ఆయన వందలాది పుస్తకాలు చదివి తన మేధస్సును పదును పెట్టుకున్నారు. అంధవిశ్వాసాలకు తావులేని హేతుబద్ధమైన సమాజం కోసం ఆయన తపించారు.

**- భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురును స్మరించుకుంటూ 'ఈవార్తలు' ప్రత్యేక కథనం**





# ముగ్గురికి సుప్రీం సూపర్ డాడీ పురస్కారాలు

హైదరాబాద్, మార్చి 22 (ఈవార్తలు): వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవం సందర్భంగా కోలరాజు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కోలరాజు సుప్రీం సూపర్ డాడీ పురస్కారాలకు ముగ్గురిని ఎంపిక చేసినట్లు మండలి వ్యవస్థాపకుడు మధుకర్ వైద్యుల తెలిపారు. ఏపీలోని తిరుపతి జిల్లాకు చెందిన మధురాంతకం సత్యనారాయణ, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన లయన్ మనోజ్ కుమార్ అగర్వాల్, పెద్దపల్లి పట్టణానికి చెందిన ఏముర్ల రాజును ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జ్యూరీ కమిటీలో మధుకర్ వైద్యుల, కే మాధురి, దేవి లక్ష్మీ నరసయ్య ఉన్నట్లు వివరించారు. విజేతలకు ఈ నెల 26న హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో జరిగే వసుంధర విజ్ఞాన వికాస మండలి వార్షికోత్సవంలో పురస్కారం అందజేస్తామని పేర్కొన్నారు.

# ఏపీ రాష్ట్ర పండుగగా దొమ్మేటి జయంతి

అమరావతి, మార్చి 22 (ఈవార్తలు): యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మరో కీలక హామీని ఏపీ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. ప్రముఖ సంఘ సంస్కర్త, శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు లోకేశ్ చేపట్టిన పాదయాత్రలో ఈ మేరకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ హామీని అమలు చేస్తామని లోకేశ్ అప్పట్లో ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. దీని ప్రకారం, ప్రతి ఏటా మార్చి 23న అన్ని ప్రభుత్వ శాఖలు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నాయి. కోనసీమ ప్రాంతానికి చెందిన స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి, శెట్టిబలిజ సమాజంలో విద్య, ఐక్యత, ఆత్మగౌరవం కోసం విశేషంగా కృషి చేసిన గొప్ప సంస్కర్త. శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, 19వ శతాబ్దం తొలినాళ్లలోనే అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో పాటుపడ్డారు. విద్య యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పి, సామాజిక చైతన్యానికి బాటలు వేశారు. ఆయన సేవలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడిగా రఘునాథ్ గెలుపు



హైదరాబాద్, మార్చి 22 (ఈవార్తలు): తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడిగా తెలంగాణ హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ అడ్వకేట్ రఘునాథ్ వేరోస్ గెలుపొందారు. ఆయన గెలుపుపై మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు. బార్ కౌన్సిల్ సభ్యుడిగా రఘునాథ్ ఎన్నిక.. కేవలం ఒక వ్యక్తి విజయం కాదని, న్యాయం, విలువలు, సామాజిక బాధ్యతలకు లభించిన గౌరవం అని కొనియాడారు. ఎన్నో పోరాటాలు, ఎన్నో త్యాగాలకు లభించిన గుర్తింపు అని వెల్లడించారు.

**న్యాయవాదులకు అండగా వేరోస్**

న్యాయ వ్యవస్థ బలంగా నిలవాలంటే, కేవలం చట్టాలు సరిపోవు; వాటిని విలువలతో ఆచరణలో పెట్టే వ్యక్తులు అవసరం. దానికి తగ్గ వ్యక్తి రఘునాథ్. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆయన జీవితం, సాధారణ పోరాటం కాదు.. విలువల కోసం సాగిన నిరంతర యాత్ర. శరీర పరిమితులు ఉన్నప్పటికీ, వాటిని అడ్డంకులుగా కాకుండా తన ఆత్మవిశ్వాసానికి పునాదులుగా మలచుకున్నారు. 1993లో న్యాయవాదిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన, ఆరంభం నుంచే సామాజిక న్యాయం, మానవ హక్కుల పట్ల అచంచలమైన నిబద్ధతను చూపించారు. న్యాయ రంగంలోని ప్రముఖులు బొజ్జా తారకం, కన్నబీరన్ వంటి మహానుభావులను అనుసరించారు. న్యాయాన్ని కేవలం వృత్తిగా కాకుండా ఒక బాధ్యతగా భావించారు. అణగారిన వర్గాలు, ఆదివాసీలు, పేద ప్రజల హక్కుల పరిరక్షణలో ఆయన చేసిన కృషి విశేషం. ప్రస్తుత కాలంలో న్యాయ వ్యవస్థలో బాధ్యత, పారదర్శకత, సమానత్వం వంటి విలువలను బలోపేతం కోసం రఘునాథ్ వేరోస్ నిరంతరం కృషి చేస్తున్నారు. న్యాయాన్ని సామాజిక న్యాయంతో అనుసంధానం చేసే ప్రయత్నం చేస్తున్నారు. హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా ఆయన న్యాయవాదుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు ఆయన నాయకత్వానికి నిదర్శనం. కమిట్‌మెంట్, పారదర్శకత, బాధ్యత, సమానత్వ విలువలను పాటించారు.



# గ్రానైట్ లారీల అడ్డగింత

కొడిమ్యాల, మార్చి 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం అప్పారావుపేటలో అక్రమంగా వెళ్తున్న గ్రానైట్ లారీలను స్థానిక సర్పంచ్ బండ వినీలా నర్సింహారెడ్డి , వార్డు సభ్యులు, యువకులు పొన్నం అజయ్ గౌడ్, రేకులపల్లి గంగారెడ్డి, కొలుపుల జగన్, పండుగ గంగయ్య తదితరులు అడ్డుకున్నారు. అక్రమ రవాణాపై డ్రైవర్‌ను నిలదీశారు. లారీని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

# అక్రమ ఫిషింగ్ బోట్లను అడ్డుకోండి

**తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాలకు ఏపీ విజ్ఞప్తి**



విజయవాడ, మార్చి 22 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లోకి తమిళనాడుకు చెందిన మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లు అక్రమంగా ప్రవేశించి వేట సాగించడంపై ఏపీ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యపై తమిళనాడు ప్రభుత్వ యంత్రాంగంతో సంప్రదింపులు జరిపింది. తమిళనాడు బోట్ల చొరబాట్లను నివారించేందుకు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఏపీ ఫిషరీస్ కమిషనర్ రామ శంకర్ నాయక్, తమిళనాడు ఫిషరీస్ అండ్ ఫిషర్‌మెన్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. తమిళనాడు బోట్ల అక్రమ ప్రవేశం యథేచ్ఛగా కొనసాగుతోందని, దీనివల్ల స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని లేఖలో పేర్కొన్నారు. ఈ చొరబాట్లు శాంతిభద్రతల సమస్యలకు కూడా దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి 18న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన ఓ సంఘటనను ఆయన తమిళనాడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల అదుపులో ఉన్న నాలుగు ఫిషింగ్ బోట్లను పుదుచ్చేరికి చెందిన మత్స్యకారులు బలవంతంగా తీసుకెళ్లారని తెలిపారు. ఈ ఘటన కారణంగా తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని 162 మత్స్యకార గ్రామాల్లో తీవ్ర ఆందోళన నెలకొందని వివరించారు. ఇదే సమస్యపై 2022, 2023, 2025 సంవత్సరాల్లో కూడా లేఖలు రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తమిళనాడు బోట్లు ఏపీ జలాల్లో ట్రాలింగ్ వంటి విధ్వంసకర పద్ధతుల్లో వేట సాగించడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని రామ శంకర్ నాయక్ తెలిపారు. దీనివల్ల తాబేళ్లు, ఇతర అంతరించిపోతున్న సముద్ర జీవుల మరణాలు పెరిగి, వాటి కళేబరాలు ఏపీ తీరానికి కొట్టుకొస్తున్నాయని లేఖలో వివరించారు.

# కోతుల దాడి.. అధికారులు పట్టరేమి?

**గుంపులుగా దాడి చేస్తున్న వానరాలు**

**పంటలు, తోటలు, ఇళ్ల ధ్వంసం**

**ప్రజల భద్రతపై తీవ్ర ఆందోళన**



కాకినాడ, మార్చి 23 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా శ్రీరాంపురం శ్రీరాంపురం ప్రాంతంలో కోతుల సమస్య రోజురోజుకీ తీవ్రమవుతోంది. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను తీసుకెళ్లడం, పైకప్పులపై సంచరిస్తూ కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేయడం వంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. స్థానికుల ప్రకారం, ఉదయం, సాయంత్రం సమయాల్లో కోతుల గుంపులు పెద్ద ఎత్తున తిరుగుతూ చిన్నపిల్లలు, వృద్ధులకు భయం కలిగిస్తున్నాయి. కొన్నిచోట్ల కోతులు దాడి చేయడానికి ప్రయత్నించిన ఘటనలు కూడా నమోదయ్యాయి. రైతులు, ఇంటి యజమానులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు, తోటలు, ఇంటి వస్తువులు కోతుల వల్ల నష్టపోతున్నాయని వారు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు మున్సిపల్ అధికారులు మరియు అటవీ శాఖ దృష్టికి తీసుకెళ్లినా, ఇప్పటివరకు సరైన పరిష్కారం లభించలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకుని కోతులను సురక్షితంగా పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందిస్తూ, ఈ సమస్యపై అటవీ శాఖతో కలిసి చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. త్వరలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కోతుల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# స్వాములూ.. పులి ఉంది జాగ్రత్త!

కొడిమ్యాల, మార్చి 22 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి కాలినడకన వసు న్న దీక్షాస్వాములకు రుద్రంగి, కొడిమ్యాల స్థానికులు అలర్ట్ ప్రకటించారు. రుద్రంగి, కొడిమ్యాల మధ్యలో పులి సంచరిస్తున్నందున కొండగట్టు వెళ్ళేవారు షార్ట్ కట్ అని గోవిందారం తర్వాత ఉన్న అడవి మధ్య గుండా వెళ్లవద్దని సూచించారు. తెలిసినవాళ్లు ఉన్నా వాళ్లకు తెలియజేయాలని విన్నవించారు.



# సాటా ఆధ్వర్యంలో ఉగాది, రంజాన్ వేడుకలు

జగిత్యాల టౌన్, మార్చి 22 (ఈవార్తలు): సౌదీ అరేబియాలోని రియాద్ నగరంలో సౌదీ అరేబియా తెలుగు సంఘం (సాటా) ఆధ్వర్యంలో ఉగాది, రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయుల సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేసే విధంగా ఉగాది, రంజాన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాటా రియాద్ అధ్యక్షుడు శ్రీనివాస్ మచ్చ మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండుగలను కలిసి జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టాసా సౌదీ అరేబియా అధ్యక్షుడు స్వామి స్వర్ణ, సాటా ఫౌండర్ మల్లేశన్, సాటా రియాద్ కోర్ టీం సభ్యులు శర్వాణి విద్యాధరణి, కోకిల ఓత్లూరి, ప్రీతి చౌహాన్, × మహమ్మద్ నూరుద్దీన్, యోగేశ్వర రావు వీరవల్లి, సింగ నరేష్ కుమార్, అహ్మద్ అబ్దుల్ కరీం, మహమ్మద్ అబ్దుల్ ఘఫ్ఫార్, మిథున సురేష్, ముదిగొండ శంకర్, మురళీ క్రిష్ణ బూసి, లోకేష్ తాళ్ళ అబ్దుల్ నయీం ఖయ్యూమ్, అయాజ్, ఖాజా ముజమ్మిల్ ఉద్దీన్, అహ్మద్ మోహియుద్దీన్ రోజ్దార్ సయ్యద్ (అస్లాం), ఫణి కుమార్ అయ్యగారి, పెంటపాటి శ్రీ చరణ్ మహమ్మద్ కమిల్, దూడం సంజీవ్, శేఖర్ పదాల తదితరులు పాల్గొన్నారు.

# ఆర్సెలార్ స్టీల్ ప్లాంట్‌కు నేడు శంకుస్థాపన

**ఏపీ పరిశ్రమల చరిత్రలో కొత్త అధ్యాయం**

అనకాపల్లి, మార్చి 22 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. రాష్ట్ర ఉక్కు రంగంలో ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా అత్యంత భారీ పెట్టుబడికి మార్గం సుగమం అయింది. ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) ఇండియా, రాష్ట్రంలో రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఏర్పాటు చేయనున్న ఈ భారీ పరిశ్రమకు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్‌ను రెండు దశల్లో నిర్మించనున్నారు. పూర్తయిన తర్వాత ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని ఇది కలిగి ఉంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ ప్లాంట్‌కు అనుబంధంగా రూ.11,198 కోట్ల వ్యయంతో ఒక క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మిస్తున్నారు. దీనివల్ల అదనంగా మరో 6 వేల మందికి ఉపాధి దొరకనుంది. ఏఎంఎన్ఎస్ ఇండియా రాకతో విశాఖ ఎకనమిక్ రీజియన్ ఒక ప్రధాన పారిశ్రామిక హబ్‌గా రూపాంతరం చెందనుండగా, జాతీయ, అంతర్జాతీయ ఉక్కు మార్కెట్‌లో ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును వీలైనంత వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోంది. ముఖ్యంగా, ప్లాంట్ నుంచి జాతీయ రహదారి-16కు అనుసంధానం చేసేందుకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులను శరవేగంగా చేపట్టింది. పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇది స్పష్టం చేస్తోంది. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఈ చర్యలు అద్దం పడుతున్నాయి. సోమవారం జరిగే ఈ చారిత్రక శంకుస్థాపన కార్యక్రమానికి ప్రభుత్వ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం నేరుగా రాజయ్యపేటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3:40 గంటలకు ప్లాంట్‌కు సంబంధించిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ మోడల్‌ను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4:50 గంటలకు జరిగే సభలో సీఎం ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ నారాయణ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్రతినిధులు హాజరవుతున్నారు.



# లారీ ఢీకొని భార్యాభర్తలు దుర్మరణం

చిత్తూరు, మార్చి 22 (ఈవార్తలు): ఏపీలోని చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైరెడ్డిపల్లి మండలం కప్పల్లె వద్ద ఆదివారం తెల్లవారుజామున వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి లారీని ఢీకొట్టడంతో దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసుల కథనం ప్రకారం, వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులోని వస్తువులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను అనంతపురం జిల్లాకు చెందిన దంపతులుగా గుర్తించారు. వారు తమ పనుల మీద వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతివేగం లేదా డ్రైవర్ నిద్రమత్తులోకి జారడమే ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# ధరూర్ డామినేటర్స్ జయకేతనం

**లెజెండ్ వారియర్స్‌పై గెలుపు.. ముగిసిన ధరూర్ ప్రీమియర్ లీగ్2**

జగిత్యాల రూరల్, మార్చి 22 (ఈవార్తలు): జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో అత్తినేని చంద్రయ్య స్మారకార్థం అత్తినేని రమేశ్ నిర్వహిస్తున్న ధరూర్ ప్రీమియర్ లీగ్2 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం తో ముగిసింది. టోర్నమెంట్ లో భాగంగా ఆదివారం రోజున ధరూర్ డామినేటర్స్,లెజెండ్ వారియర్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరగగా ధరూర్ డామినేటర్స్ జట్టు విజయం సాధించింది.కాగా విజేతగా నిలిచిన జట్టుకు నిర్వాహకుడు అత్తినేని రమేష్ 6,666 రూపాయల నగదు బహుమతితో పాటుగా ట్రోఫీని ,రన్నర్ గా నిలిచిన లెజెండ్ వారియర్స్ టీమ్ కి 4,444 నగదు బహుమతి తో పాటుగా ట్రోఫీని అందేశారు. ఈ కార్యక్రమంలో ధరూర్ గ్రామ సర్పంచ్ శీలం సురేందర్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

# జగన్‌ను సంఘ బహిష్కరణ చేయాలి

**ఎంపీ కలిశెట్టి తీవ్ర వ్యాఖ్యలు**



మంగళగిరి, మార్చి 22 (ఈవార్తలు): సమాజం పట్ల, కన్నతల్లి, తోబుట్టువు పట్ల కనీస కనికరం, గౌరవం లేని వ్యక్తి నాయకుడిగా ఎలా రాణిస్తారని వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓటమి తర్వాత కూడా జగన్ తన దుర్మార్గపు ఆలోచనలను మానుకోలేదని, సొంత కుటుంబ సభ్యులపైనే విషప్రచారం చేయిస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కుటుంబ బాధ్యత, సామాజిక స్పృహ లేని ఇలాంటి వ్యక్తిని రాజకీయంగా ఓడించడం అనేది చిన్న మాట.. ఆయన్ను సమాజం నుంచే బహిష్కరించాలి" అని కలిశెట్టి అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ తీరు రాష్ట్ర పరువును జాతీయ స్థాయిలో మంటగలుపుతోందన్నారు. కన్నతల్లి విజయమ్మను కోర్టుల పాలు చేస్తూ, తన పేటీఎం బ్యాచ్‌తో ఆమెపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టించడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. సొంత కుటుంబంలోని మహిళలకే రక్షణ ఇవ్వలేని వ్యక్తి, రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఏం భరోసా ఇస్తారని ప్రశ్నించారు. ఇది వారి ఇంటి వ్యవహారం కాదని, రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డ మనోభావాలకు సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. ఒక రాష్ట్ర ఆడబిడ్డగా ఎవరికి అన్యాయం జరిగినా అండగా నిలవాల్సిన బాధ్యత టీడీపీపై ఉందని, జగన్ కుటుంబ సభ్యులకు కూడా తమ నైతిక మద్దతు ఉంటుందని తెలిపారు.

**ఉత్తరాంధ్రను ఉత్తుత్తి ఆంధ్రగా మార్చారు**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, 'ఉత్తుత్తి ఆంధ్ర'గా మార్చేశారని అప్పలనాయుడు ఆరోపించారు. అక్కడి వనరులను దోచుకున్నారు తప్ప, యువతకు ఉపాధి కల్పించాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు. కానీ, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత లోకేశ్, బీజేపీ నాయకత్వం రాష్ట్రానికి నాలుగు స్తంభాలుగా నిలబడి ప్రగతి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల్లోనే ఉత్తరాంధ్ర అభివృద్ధిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని, అభివృద్ధి అంటే మాటలు కాదని, చేతల్లో చూపిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తుంటే.. జగన్ ఓర్వలేక విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# అంధకారంలో క్యూబా

## కుప్పకూని జాతీయ గ్రిడ్

### అమెరికా ఆంక్షల ఎఫెక్ట్



న్యూఢిల్లీ: కరేబియన్ దేశం క్యూబా మరోసారి అంధకారంలోకి జారుకుంది. దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా చేసే జాతీయ గ్రిడ్ (నేషనల్ ఎలక్ట్రిక్ పవర్ సిస్టమ్) శనివారం సాయంత్రం పూర్తిగా కుప్పకూలింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6:32 గంటలకు ఈ వైఫల్యం సంభవించడంతో, దాదాపు కోటి మందికి పైగా ప్రజలు చీకట్లోనే గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ వారంలో ఇలా జరగడం ఇది రెండోసారి కాగా, ఈ నెలలో ఇది మూడో అతిపెద్ద బ్లాక్‌అవుట్ కావడం అక్కడి సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ఘటనపై క్యూబా ప్రభుత్వ విద్యుత్ సంస్థ యూనియన్ ఎలక్ట్రికా సోషల్ మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేసింది. జాతీయ గ్రిడ్ పూర్తిగా డిస్‌కనెక్ట్ అయిందని, పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. కమాగ్వే ప్రావిన్స్‌లోని న్యూవిటాస్ థర్మోఎలక్ట్రిక్ ప్లాంట్‌లో జనరేటింగ్ యూనిట్ ఒకటి ఊహించని విధంగా విఫలమవడమే ఈ వైఫల్యానికి కారణమని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. ఈ నెల 4న, 16న కూడా ఇలాంటి వైఫల్యాలే దేశాన్ని గంటల తరబడి చీకట్లో ఉంచాయి. ఈ నిరంతర విద్యుత్ సంక్షోభం వెనుక అమెరికా ఆంక్షలు, ఇంధన కొరత ప్రధాన కారణాలుగా ఉన్నాయి. వెనెజువెలా నుంచి రాయితీ ధరలకు అందే చమురు సరఫరా నిలిచిపోవడం క్యూబాను తీవ్రంగా దెబ్బతీసింది. అమెరికా జోక్యంతో వెనెజువెలాలో ప్రభుత్వం మారడంతో ఈ సరఫరా ఆగిపోయింది. మరోవైపు, మెక్సికో కూడా చమురు ఎగుమతులను నిలిపివేసి, కేవలం మానవతా సాయానికే పరిమితమైంది. ఇతర దేశాలు క్యూబాకు చమురు అమ్మితే కఠిన చర్యలు తప్పవని అమెరికా హెచ్చరించడం, ఇరాన్‌తో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం వంటివి ఈ సమస్యను మరింత జఠిలం చేశాయి. క్యూబా ప్రభుత్వం తమ ఆర్థిక ఇబ్బందులకు, విద్యుత్ వైఫల్యాలకు అమెరికా వాణిజ్య ఆంక్షలే కారణమని ఆరోపిస్తుండగా, అమెరికా మాత్రం క్యూబా అనుసరిస్తున్న సోవియట్ తరహా ఆర్థిక విధానాల వైఫల్యమే దీనికి కారణమని వాదిస్తోంది. వాస్తవానికి, దేశంలోని విద్యుత్ మౌలిక సదుపాయాలు చాలా వరకు పాతబడిపోయి, తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. తాజా బ్లాక్‌అవుట్‌తో రాజధాని హవానాతో సహా పలు నగరాల్లో ప్రజలు టార్చ్‌లైట్ల వెలుగులో రోడ్లపైకి రావడం కనిపించింది. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా కేంద్రాలు వంటి అత్యవసర సేవలకు ముందుగా విద్యుత్ పునరుద్ధరించే పనులు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అయితే, ఉత్పత్తి సామర్థ్యం చాలా తక్కువగా ఉండటంతో దేశవ్యాప్తంగా సాధారణ పరిస్థితులు నెలకొనడానికి ఇంకా సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ వరుస విద్యుత్ కోతలు క్యూబా ప్రజల దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

## బరువు పెరిగితే జీతంలో కోత

### క్యాబిన్ క్రూ ఫిట్‌నెస్‌పై ఎయిరిండియా నిర్ణయం



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ ఆధీనంలోని ఎయిర్ ఇండియా సంస్థ తన క్యాబిన్ సిబ్బంది ఫిట్‌నెస్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. నిర్దేశించిన బరువు కంటే ఎక్కువగా ఉన్న సిబ్బందిని విధులకు దూరం పెట్టడంతో పాటు వారి జీతాల్లో కోత విధించాలని యోచిస్తోంది. సంస్థ ప్రతిష్టను, సేవల నాణ్యతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ఈ నిబంధనలను కఠినతరం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, సిబ్బంది బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)ని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తారు. ఎవరైనా నిర్దేశిత ప్రమాణాల కంటే ఎక్కువ బరువు ఉన్నట్లు తేలితే, వారిని 'అన్‌ఫిట్'గా పరిగణిస్తారు. బరువు తగ్గేందుకు వారికి కొంత గడువు ఇచ్చిన తర్వాత కూడా మార్పు లేకపోతే విమాన విధుల నుంచి తప్పించడం (గ్రౌండింగ్) లేదా జీతంలో కోత విధించడం వంటి చర్యలు తీసుకోనున్నారు. కేవలం బాహ్య సౌందర్యం కోసమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది చురుగ్గా, సమర్థంగా స్పందించేందుకు శారీరక దృఢత్వం చాలా అవసరమని యాజమాన్యం భావిస్తోంది. టాటా గ్రూప్ చేతికి వచ్చాక ఎయిర్ ఇండియా బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచ స్థాయిలో మెరుగుపరిచేందుకు చేపడుతున్న సంస్కరణల్లో భాగంగానే ఈ కఠిన నిబంధనలను అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయంపై క్యాబిన్ క్రూ యూనియన్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది. కేవలం బరువు ఆధారంగా జీతంలో కోతలు విధించడం సరికాదని, ఉద్యోగుల వయసు, ఇతర ఆరోగ్య సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వారు వాదిస్తున్నారు.

## మంగళూరుకు అమెరికా గ్యాస్, రష్యా ఆయిల్ నౌకలు

మంగళూరు: ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో ఆటంకాలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, భారత్ తన ఇంధన భద్రతను పటిష్ఠం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా అమెరికా నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ), రష్యా నుంచి ముడి చమురుతో కూడిన భారీ నౌకలు మంగళూరు పోర్టుకు చేరుకున్నాయి. అమెరికాలోని టెక్సాస్ నుంచి ఎల్పీజీతో బయలుదేరిన 'పైక్సిస్ పయనీర్' అనే కార్గో నౌక విజయవంతంగా మంగళూరు పోర్టులో లంగరేసింది. ఇదే సమయంలో, రష్యా నుంచి ముడి చమురును తీసుకొచ్చిన మరో నౌక కూడా పోర్టుకు 18 నాటికల్ మైళ్ల దూరంలో నిలిపి ఉంచారు. సింగిల్-పాయింట్ మూరింగ్ వ్యవస్థ ద్వారా ఈ చమురును పైప్‌లైన్‌లోకి, అక్కడి నుంచి మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ కు తరలించనున్నారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఇంధన ధరలను స్థిరీకరించే లక్ష్యంతో, సముద్రంలో అప్పటికే ప్రయాణంలో ఉన్న రష్యా ముడి చమురు అమ్మకాలకు అమెరికా తాత్కాలికంగా అనుమతి ఇచ్చింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. ఇరాన్ ప్రమేయంతో నెలకొన్న వివాదాల వల్ల సరఫరాలో ఆటంకాలు ఏర్పడటంతో, భారత్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో, ఈ వారం గుజరాత్‌లోని వాడినార్, ముంద్రా పోర్టులకు 'నందా దేవి', 'శివాలిక్' అనే రెండు భారత ఎల్పీజీ ట్యాంకర్లు కూడా సురక్షితంగా చేరుకున్నాయి. ప్రమాదకరమైన హర్మూజ్ జలసంధి గుండా ఇవి ప్రయాణించి రావడం గమనార్హం. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మంది భారత నావికులతో కూడిన 22 భారత నౌకలు ఉన్నాయని, డీజీ షిప్పింగ్ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని అధికారులు తెలిపారు.

## అరేబియా సముద్రంలో బ్రిటన్ సబ్‌మెరైన్

లండన్: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం ముదురుతున్న వేళ పశ్చిమాసియాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిటన్ తన అత్యంత శక్తిమంతమైన అణు జలాంతర్గామిని అరేబియా సముద్రంలో మోహరించింది. ఇటీవల ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల నేపథ్యంలో గల్ఫ్ జలాల్లో ప్రయాణించే తమ వాణిజ్య నౌకల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్రిటన్ స్పష్టం చేసింది. బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన ఈ జలాంతర్గామిలో 1000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం అత్యంత కచ్చితత్వంతో ఛేదించగల 'తొమహాక్' క్రూయిజ్ క్షిపణులు ఉన్నాయి. శత్రువుల కంట పడకుండా నీటి అడుగు నుంచి దాడి చేయగల సామర్థ్యం దీని సొంతం. ఈ చర్య ద్వారా తన మిత్రదేశమైన అమెరికాకు మద్దతు తెలపడంతో పాటు, ఇరాన్ దూకుడుకు అడ్డుకట్ట వేయాలని యూకే భావిస్తోంది. హర్మూజ్ జలసంధి, ఎర్ర సముద్రం వంటి కీలక వాణిజ్య మార్గాల్లో నౌకాయానానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడటమే తమ ఉద్దేశమని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, బ్రిటన్ చర్యపై ఇరాన్, రష్యాలు తీవ్రంగా స్పందించాయి. తమ జలాల్లోకి విదేశీ శక్తులు ప్రవేశిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ హెచ్చరించింది. ఇది యుద్ధాన్ని మరింత రెచ్చగొట్టే చర్య అని, ఉద్రిక్తతలను మరింత పెంచుతుందని రష్యా విమర్శించింది.

## పాక్‌లో మరో టెర్రరిస్టు హత్య

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో మరో ఉగ్రవాది హతమయ్యాడు. లష్కరే తోయిబా సంస్థకు చెందిన కీలక కమాండర్ బిలాల్ ఆరిఫ్ సరాఫీ దారుణ హత్యకు గురయ్యాడు. అయితే, ఈ హత్య వెనుక అతని కుటుంబ సభ్యులే ఉన్నారనే వార్తలు ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పాకిస్థాన్‌లోని మురిడ్కేలో ఉన్న తన నివాసంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం.. దుండగులు తొలుత బిలాల్‌పై కత్తులతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఆ తర్వాత తుపాకీతో కాల్చి చంపారు. కుటుంబ కలహాలు లేదా వ్యక్తిగత కక్షల వల్లే ఈ హత్య జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఒక ఉగ్రవాద సంస్థలో కీలక నేత సొంత కుటుంబ సభ్యుల చేతిలోనే హతమయ్యాడనే వార్త సంచలనంగా మారింది. బిలాల్ ఆరిఫ్ సరాఫీ లష్కరే తోయిబాలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ముఖ్యంగా ఉగ్రవాదులను రిక్రూట్ చేసుకోవడం, వారికి సిద్ధాంతపరంగా శిక్షణ ఇవ్వడం వంటి కార్యకలాపాల్లో ఇతనిది కీలక పాత్ర అని నిఘా వర్గాలు చెబుతున్నాయి. మురిడ్కేలోని లష్కర్ ప్రధాన కార్యాలయం కేంద్రంగా ఇతడు తన కార్యకలాపాలను కొనసాగించేవాడు. పాకిస్థాన్ అధికారులు ఈ హత్య ఘటనపై ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది.

## ఖతార్‌లో కూలిన సైనిక హెలికాప్టర్.. ఆరుగురి మృతి

దోహా: ఖతార్‌లో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆ దేశానికి చెందిన ఒక సైనిక హెలికాప్టర్ సముద్ర జలాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించగా, మరొకరు గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం అధికారులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడమే ప్రమాదానికి కారణమని ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. "ఖతార్‌కు చెందిన హెలికాప్టర్ రొటీన్ డ్యూటీలో ఉండగా సాంకేతిక సమస్య కారణంగా దేశ జలాల్లో కూలిపోయింది" అని ఆ ప్రకటనలో పేర్కొంది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో మొత్తం ఏడుగురు సిబ్బంది ఉన్నారని ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

## భారత్‌పై బాంబులు వేస్తాం: పాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ అమెరికా తమ దేశంపై దాడి చేస్తే, అందుకు ప్రతీకారంగా తాము భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. ఢిల్లీ, ముంబై నగరాలపై బాంబు దాడులకు దిగుతామని ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ఓ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన... "అమెరికా మాపై దాడి చేస్తే, మేం వెంటనే భారత్‌పై దాడి చేయాలి. ముంబై, ఢిల్లీలను వదిలిపెట్టం. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం" అని పేర్కొన్నారు. తమ దేశ అణు సంపదను లక్ష్యంగా చేసుకున్నా ఇదే తరహా ప్రతిస్పందన ఉంటుందని అన్నారు. అయితే, ఇది దాదాపు అసాధ్యమైన సందర్భమని అంగీకరిస్తూనే, దీనిని 'వ్యూహాత్మక ఉన్మాదం'గా అభివర్ణించడం గమనార్హం. 2014 నుంచి 2017 వరకు భారత్‌లో పాకిస్థాన్ హైకమిషనర్‌గా పనిచేసిన బాసిత్ నుంచి ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు రావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు ఎదుర్కొంటోంది. ఈ సమయంలో భారత్‌ను అనవసరంగా వివాదంలోకి లాగుతూ బాసిత్ మాట్లాడటంపై సోషల్ మీడియాలో భారతీయులు తీవ్రంగా మండిపడుతున్నారు. పాక్ అధికారులకు తమ సమస్యలను పక్కనపెట్టి భారత్‌ను బెదిరించడం అలవాటుగా మారిందని నెటిజన్లు విమర్శిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి స్పందన రాలేదు.



## పరిమిత సంఖ్యలోనే విమానాలు!

పశ్చిమాసియాలో వేగంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో భారత విమానయాన సంస్థలు ఆదివారం (మార్చి 22న) పరిమిత సంఖ్యలో విమాన సర్వీసులను కొనసాగించినట్లు ప్రకటించాయి. చివరి నిమిషంలో మార్పులు జరిగే అవకాశం ఉన్నందున, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, బయలుదేరే ముందు తమ విమాన స్థితిని (ఫ్లైట్ స్టేటస్) తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించాయి. ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో, ప్రస్తుత భద్రతా పరిస్థితులు, నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి ఎంపిక చేసిన కొన్ని విమానాలను నడుపుతున్నట్లు తెలిపింది. "పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల్లో ప్రయాణికులకు సహాయం చేయడానికి, వారిని తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడానికి మా బృందాలు రాత్రింబవళ్లు పనిచేస్తున్నాయి" అని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే తమకు అత్యంత ముఖ్యమని, ప్రతి నిర్ణయం వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకునే తీసుకుంటామని ఇండిగో స్పష్టం చేసింది. మరోవైపు ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి.

# శత్రువులకు తప్ప అందరికీ ఓపెన్

### హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ప్రకటన

### ట్రంప్ అల్టిమేటానికి కౌంటర్

టెహ్రాన్: హర్మూజ్ జలసంధిని అన్ని దేశాల నౌకల కోసం తెరిచే ఉంచామని, అయితే తమ శత్రు దేశాలకు చెందిన నౌకలను మాత్రం అనుమతించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 48 గంటల అల్టిమేటం నేపథ్యంలో టెహ్రాన్ ఈ కీలక ప్రకటన చేసింది. సమన్వయంతో ముందుకు వచ్చే ఇతర దేశాల నౌకలు సురక్షితంగా ప్రయాణించవచ్చని తెలిపింది. అంతర్జాతీయ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఓ)లో ఇరాన్ సీనియర్ ప్రతినిధి అలీ మౌసావి ఈ విషయాలను వెల్లడించారు. జలసంధిలో ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులకు అమెరికా, ఇజ్రాయెల్లే కారణమని ఆయన ఆరోపించారు. తాము దౌత్యానికే ప్రాధాన్యత ఇస్తామని, అయితే దురాక్రమణలను అడ్డుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. నావికుల భద్రత కోసం ఐఎంవోతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మరోవైపు, 48 గంటల్లోగా హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. ప్రపంచంలోని మొత్తం చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు ఈ జలసంధి నుంచే జరుగుతుంది. దీంతో ఇక్కడ ఎలాంటి అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.



### శత్రుదేశాల నీటి ప్లాంట్లే మా లక్ష్యం: ఇరాన్

టెహ్రాన్: హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన 48 గంటల హెచ్చరికలకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశంలోని విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తే, పశ్చిమాసియాలోని శత్రుదేశాల మంచినీటి ప్లాంట్లనే లక్ష్యంగా చేసుకుంటామని ఘాటుగా హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సైనిక ఉన్నతాధికారులు చేసిన ప్రకటన గల్ఫ్ ప్రాంతంలో కొత్త ఉద్రిక్తతలకు దారితీసింది. పశ్చిమాసియాలోని సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ వంటి దేశాలు తమ తాగునీటి అవసరాల్లో దాదాపు 90 శాతం సముద్రపు నీటిని శుద్ధి చేసే డీశాలినేషన్ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ హెచ్చరికలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ప్లాంట్లపై చిన్న క్షిపణి దాడి జరిగినా కోట్లాది మంది ప్రజలు తీవ్ర నీటి సంక్షోభంలో చిక్కుకుంటారు. విద్యుత్ ప్లాంట్లతో పోలిస్తే నీటి శుద్ధి కేంద్రాల పునరుద్ధరణ అత్యంత ఖర్చుతో కూడుకున్నది, ఎక్కువ సమయం తీసుకుంటుంది. అందుకే తమపై దాడి జరిగితే శత్రుదేశాల మనుగడనే దెబ్బతీసేలా ఈ ప్రణాళికను ఇరాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రకటనతో అమెరికాకే కాకుండా, ఆ దేశ మిత్రపక్షాలైన అరబ్ దేశాలకు కూడా ఇరాన్ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చింది. దీంతో హర్మూజ్ జలసంధి వివాదం ఇప్పుడు 'నీటి యుద్ధం' వైపు మళ్లుతోందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ విధించిన గడువు సమీపిస్తున్న వేళ, ఇరు దేశాల నుంచి వస్తున్న ఇటువంటి కవ్వింపు చర్యలు, ప్రతిస్పందనలు గల్ఫ్‌లో యుద్ధ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి.

# సైరన్ల మధ్యే జీవితం

### ఇజ్రాయెల్‌లో ఓ ఇన్‌ఫ్లుయెన్సర్



జెరూసలేం: ఇజ్రాయెల్‌లో ప్రస్తుత పరిస్థితులు భయం, ఆందోళనలతో నిండిపోయాయని, ఏ క్షణంలోనైనా తమపై క్షిపణులు విరుచుకుపడతాయనే భయంతో అక్కడి పౌరులు జీవిస్తున్నారని భారత-ఇజ్రాయెల్ ఇన్‌ఫ్లుయెన్సర్ రెవిటల్ మోజెస్ ఆవేదన వ్యక్తం చేశారు. సైరన్ల శబ్దాల మధ్యే ఇజ్రాయెల్ ప్రజల జీవితం సాగిపోతోందని ఆమె తెలిపారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "మేం ఇక్కడ సైరన్ల మధ్యే మా జీవితాలను కొనసాగిస్తున్నాం. నిత్యావసరాలు కొనాలన్నా, వీడియోలు చేయాలన్నా, ఉద్యోగాలు, పిల్లల చదువులు.. అన్నీ సైరన్ల మోతల మధ్యే జరుగుతాయి. క్షిపణులు వర్షంలా కురుస్తున్నప్పుడు ప్రజలు ఇళ్లలోనే, షెల్టర్లకు దగ్గరగా ఉండటానికి ప్రయత్నిస్తారు. రాత్రి 1 లేదా 3 గంటలకు కూడా దాడులు జరగవచ్చు కాబట్టి, వృద్ధులు పరిగెత్తలేక షెల్టర్లలోనే నిద్రపోతున్నారు. ఇజ్రాయెల్ ప్రజల ధైర్యం ఎక్కడికీ పోలేదు, మేం కేవలం భిన్నమైన రీతిలో జీవించడానికి ప్రయత్నిస్తున్నాం" అని రెవిటల్ వివరించారు. ఆరేళ్ల క్రితం 2020లో తాను ఇజ్రాయెల్ వచ్చినట్లు ఆమె తెలిపారు. ఎప్పుడు క్షిపణులు దాడి చేస్తాయో, మరుసటి రోజు చూస్తామో లేదో తెలియని భయం ప్రతి ఒక్కరి గుండెల్లో ఉందని ఆమె అన్నారు. పశ్చిమాసియాలో ఈ ఉద్రిక్తతలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు చేయడంతో మొదలయ్యాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ, ఉన్నత సైనిక అధికారులు మరణించారు. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్.. అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు ప్రారంభించింది. ఈ భయానక పరిస్థితుల్లోనూ ఇజ్రాయెల్ ప్రజల ధైర్యాన్ని చాటిచెప్పే ఒక సంఘటనను రెవిటల్ పంచుకున్నారు. క్షిపణులు కురుస్తున్నప్పటికీ, తన స్నేహితులైన ఒక జంట పెళ్లిని ఆపుకోలేదని ఆమె తెలిపారు. "బాలిస్టిక్ క్షిపణులు పడుతున్నా సరే, పెళ్లి ఆగకూడదని ఆ జంట నిర్ణయించుకుంది. బంకర్‌లోనే పెళ్లి చేసుకుంటామని ముందుకెళ్లారు. ఈ విషయం సోషల్ మీడియాలో ఎంత వైరల్ అయిందంటే, అపరిచితులు కూడా వారి పెళ్లి వేడుకలో పాలుపంచుకోవడానికి తరలివచ్చారు. యూదు మత గురువు అయిన రబ్బీ ఈ వివాహ వేడుకను జరిపించారు. బంకర్ అత్యంత సురక్షితమైన ప్రదేశం కాబట్టి, అక్కడే వేడుక చేసుకుని, బతికి ఉండాలనే ఆశతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు" అని రెవిటల్ ఉద్వేగంగా చెప్పారు. ఇదిలా ఉండగా, శనివారం ఇరాన్ జరిపిన దాడుల్లో ఇజ్రాయెల్‌లోని డిమోనా, అరాద్ ప్రాంతాల్లో సుమారు 200 మంది గాయపడినట్లు, వారిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానిక మీడియా ఆదివారం తెలిపింది. కనీసం రెండు బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్ వాయు రక్షణ వ్యవస్థ అడ్డగించలేకపోయిందని పేర్కొంది. ఈ దాడుల అనంతరం, తమ దేశ శత్రువులతో అన్ని రంగాల్లో పోరాటం కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఐడీఎఫ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయల్ జమీర్ ప్రకటించినట్లు 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' కథనం వెల్లడించింది. దీని తర్వాత, ఇజ్రాయెల్ వైమానిక దళం టెహరాన్‌లోని ఇరాన్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుపుతోందని ఐడీఎఫ్ ప్రకటించింది.

# గ్రీన్‌ల్యాండ్‌కు అండగా ఉంటాం: ఇరాన్

టెహ్రాన్: అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ టెహ్రాన్ నుంచి ఓ వినూత్న ప్రతిపాదన వెలువడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి గ్రీన్ లాండ్ ను తాము కాపాడతామని, ఆ దేశం ఒక్కసారి అభ్యర్థిస్తే చాలు వెంటనే రంగంలోకి దిగుతామని ఇరాన్ ప్రకటించింది. అమెరికాను నేరుగా రెచ్చగొట్టేలా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. గ్రీన్ లాండ్ ను ఎలాగైనా దక్కించుకోవాలని, అమెరికా జాతీయ భద్రతకు అది అత్యంత కీలకమని డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇందుకోసం ఆ దీవిని కొనుగోలు చేయడానికి సిద్ధమని అన్నారు. డెన్మార్క్ ప్రభుత్వం ఈ కొనుగోలు ప్రతిపాదనను తోసిపుచ్చినప్పటికీ, అవసరమైతే సైనిక చర్యల ద్వారా గ్రీన్ లాండ్ పై పట్టు సాధించాలని ట్రంప్ యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పరిణామాలపై ఐరోపా సమాఖ్య, నాటో దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరాన్ వ్యూహాత్మకంగా ఈ ఆఫర్‌ను తెరపైకి తెచ్చింది. అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న దేశాలకు మద్దతు ఇవ్వడం ద్వారా అగ్రరాజ్యాన్ని ఇరుకున




పెట్టాలని ఇరాన్ భావిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. " గ్రీన్ లాండ్ కోరితే చాలు, వారికి మేము రక్షణగా నిలుస్తాం" అని ఇరాన్ అధికారులు పేర్కొనడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

వయ్యారి చిత్రం



శ్రేయా శర్మ

## థాయ్‌లాండ్‌లో విరోష్ హనీమూన్!





టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించిన విజయ్ దేవరకొండ-రష్మిక జంట ఇటీవల రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. పెళ్లి వేడుకల అనంతరం ఈ జంట తమ వ్యక్తిగత సమయాన్ని ఆస్వాదించేందుకు థాయ్‌లాండ్‌కు వెళ్లింది. ప్రస్తుతం ఈ కొత్త జంట కో సముయి ద్వీపంలో హనీమూన్‌ను ఎంజాయ్ చేస్తోంది. తాజాగా ఈ హనీమూన్ ట్రిప్‌కు సంబంధించిన ఓ రొమాంటిక్ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సముద్ర తీరాన ఉన్న అందమైన ప్రదేశంలో తీసిన ఈ ఫోటోలో విజయ్, రష్మిక ఒకరినొకరు హత్తుకుని చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నారు. రష్మిక పసుపు రంగు ఫ్లోరల్ డ్రెస్‌లో మెరిసిపోతుండగా, విజయ్ క్యాజువల్ టీ షర్ట్‌లో స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. సాధారణంగా సెలబ్రిటీలు హనీమూన్ కోసం లగ్జరీ రిసార్ట్స్‌ను ఎంచుకుంటారు. అయితే ఈ జంట మాత్రం భిన్నంగా ఆలోచించి, సముద్ర తీరానికి సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ విల్లాను ఎంపిక చేసుకుంది. ప్రకృతి ఒడిలో, పచ్చని చెట్ల మధ్య ఉన్న ఈ విల్లాలో వీరిద్దరూ ప్రశాంతంగా గడుపుతూ తమ మధుర క్షణాలను ఆస్వాదిస్తున్నారు. తమ వ్యక్తిత్వానికి తగ్గట్టుగా, హడావిడి లేకుండా ఈ ట్రిప్‌ను ప్లాన్ చేసుకున్నారని వారి సన్నిహితులు చెబుతున్నారు.

## డైరెక్టర్లే సూపర్ స్టార్లు



ఆదిత్యా ధర్ దర్శకత్వంలో వచ్చిన దురంధర్ 2 సినిమా ఘనవిజయం సాధించిన నేపథ్యంలో క్వీన్ కంగనా రనౌత్ సోషల్ మీడియా వేదికగా దర్శకుల ప్రాముఖ్యత గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదిత్యా ధర్ ఒక -సూపర్‌స్టార్ డైరెక్టర్-గా ఎదగడం ఈ సినిమా సాధించిన అతిపెద్ద విజయమని కొనియాడారు. హాలీవుడ్ చిత్ర పరిశ్రమను ఉదాహరణగా తీసుకుంటూ కంగనా మన దేశంలోని పరిస్థితులను విశ్లేషించారు. హాలీవుడ్‌లో స్టీవెన్ స్పీల్‌బర్గ్, క్రిస్టోఫర్ నోలన్, క్వింటన్ టరాంటినో వంటి దర్శకులకు అక్కడ ఉండే అగ్ర హీరోల కంటే ఎక్కువ క్రేజ్, గౌరవం ఉంటుందని గుర్తు చేశారు. అక్కడ మేకర్స్ స్థానం ఎప్పుడూ ఉన్నతంగానే ఉంటుందని.. మన దగ్గర కూడా అటువంటి మార్పు రావాలని క్వీన్ ఆకాంక్షించారు. దర్శకుడి విజన్ బాగుంటేనే సినిమా అద్భుతంగా వస్తుందని.. కానీ మన దగ్గర క్రెడిట్ అంతా హీరోలకే వెళ్తోందని కంగన అభిప్రాయపడ్డారు. భారతీయ చిత్ర పరిశ్రమలో దర్శకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కంగనా సూటిగా స్పందించారు. మన దర్శకులు విపరీతమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, అయినప్పటికీ వారికి దక్కాల్సిన గౌరవం కానీ సరైన పారితోషికాలు కానీ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా.. పరిశ్రమలోని కొందరు సూపర్ స్టార్ హీరోలు దర్శకులను వేధింపులకు గురిచేస్తున్నారని కంగన సంచలన ఆరోపణ చేశారు. ఇలాంటి కారణాల వల్లే యువత టెక్నికల్ రంగాల వైపు రావడానికి ఆసక్తి చూపడం లేదని విశ్లేషించారు. నేటి తరం యువతలో ప్రతి ఒక్కరూ నటులు కావాలని మాత్రమే కోరుకుంటున్నారని.. కానీ ఎవరూ సినిమాటోగ్రాఫర్లుగానో లేదా టెక్నీషియన్లుగానో స్థిరపడాలని కలలు కనడం లేదని కంగనా పేర్కొన్నారు. అందరూ హీరోల గ్లామర్ చూసి మోసపోతున్నారని.. కానీ అసలైన సినిమాను సృష్టించేది టెక్నీషియన్లే అని గుర్తు చేశారు. ఆదిత్యా ధర్ వంటి దర్శకులు హీరోల కంటే ఎక్కువ షైనింగ్ గా మెరుస్తున్నారని.. అతడిని చూసి భవిష్యత్తులో ఎంతోమంది దర్శకులు కావాలని ఆశపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.



## పవర్ స్టార్ 33వ సినిమా దేవకట్టాతో!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 33వ చిత్రం లాక్ అయిందా? ఈ సారి పవన్ లో రియల్ సెన్సిబిలిటీస్ ను బయటకు తీయబోతున్నాడా? అంటే అవుననే తెలుస్తోంది. విలక్షణ చిత్రాల దర్శకుడు దేవ కట్టాతో పవన్ పని చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక చర్చలు ముగిశాయని సమాచారం. స్టోరీ డిస్కషన్స్ కూడా ఓ కొలిక్కి వచ్చాయని ఫిలిం సర్కిల్స్ లో వినిపిస్తోంది. సామాజిక అంశాలను, రాజకీయ చైతన్యాన్ని తన సినిమాల్లో బలంగా చూపించే దర్శకుడు దేవ కట్టా. ఇప్పుడతడు పవన్ కళ్యాణ్ లాంటి మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడితో? జతకట్టడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దేవ కట్టా ఆలోచనా విధానం, ఆయన సినిమాల్లోని భావజాలం పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వానికి చాలా దగ్గరగా ఉంటాయి. గతంలో దేవ కట్టా తెరకెక్కించిన రిపబ్లిక్ సినిమాపై పవన్ కళ్యాణ్ ఎంతో సానుకూలంగా స్పందించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పవన్ చేసిన ప్రసంగం అప్పట్లో సెన్సేషన్ సృష్టించింది. వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే దేవ కట్టా శైలి పవన్‌కు బాగా నచ్చడంతో? వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తే అది కేవలం వినోదం మాత్రమే కాకుండా ఒక బలమైన సామాజిక సందేశాన్ని ఇచ్చేలా ఉంటుందని అభిమానులు చాలా కాలంగా ఆశిస్తున్నారు.



## షకీరా ఇండియా కాన్సర్ట్ రద్దు

ప్రపంచ ప్రఖ్యాత పాప్ సింగర్ షకీరా భారతదేశంలో నిర్వహించాల్సిన సంగీత కచేరీలు అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు తెలుస్తుంది. పశ్చిమాసియాలో, ముఖ్యంగా అమెరికా మరియు ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు మరియు యుద్ధ వాతావరణం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. జోమాటోకు చెందిన 'డిస్ట్రిక్ట్' ప్లాట్‌ఫారమ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 10, 11 తేదీల్లో ముంబైలో, అలాగే ఏప్రిల్ 15న ఢిల్లీలో ఈ వేడుకలు జరగాల్సి ఉంది. దాదాపు 19 ఏళ్ల తర్వాత షకీరా భారత్‌లో ప్రదర్శన ఇవ్వబోతుండటంతో భారీ ఎత్తున టికెట్లు అమ్ముడయ్యాయి. అయితే ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా షకిరాతో పాటు, అభిమానుల భద్రతే తమకు ముఖ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. టికెట్లు కొనుగోలు చేసిన వారికి 5 నుంచి 7 పని దినాల్లో పూర్తి డబ్బు వెనక్కి ఇస్తామని హామీ ఇచ్చారు.


## అట్లీ మూవీలో అనుష్క శర్మ?



అల్లు అర్జున్ - అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న పాన్ ఇండియా చిత్రం రోజురోజుకూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతోంది. ఈ సినిమా కాస్టింగ్ గురించి వస్తున్న తాజా అప్‌డేట్ ప్రకారం, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శర్మ ఈ ప్రాజెక్టులో చేరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ చిత్రంలో దీపికా పదుకోన్, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్ మరియు జాన్వీ కపూర్ వంటి స్టార్ హీరోయిన్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతుండగా, అనుష్క శర్మ చేరికతో ఈ సినిమాలోని ఐదవ కథానాయికగా ఆమె నిలవనుంది. చాలా ఏళ్లుగా వెండితెరకు దూరంగా ఉన్న అనుష్కకు ఇది ఒక పవర్‌ఫుల్ కమ్‌బ్యాక్ అవుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.


## పెద్దిలో మృణాల్ ఐటం సాంగ్?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మిగిలి ఉన్న కీలక అంశాల్లో ఒకటైన ఐటెం సాంగ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు బుచ్చిబాబు సన స్పెషల్ సాంగ్ కోసం సరైన హీరోయిన్



ఎంపికపై కొంతకాలంగా తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. మొదట ఈ పాటలో ముగ్గురు లేదా నలుగురు హీరోయిన్లను తీసుకోవాలనే ఆలోచన ఉన్నప్పటికీ, సమయం తక్కువగా ఉండటంతో ఆ ప్లాన్‌ను విరమించుకున్నట్లు సమాచారం. తాజాగా ఈ స్పెషల్ సాంగ్‌లో రామ్ చరణ్ సరసన నటించేందుకు మృణాల్ ఠాకూర్‌ని ఎంపిక చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆమె 'పెద్ది' పాట షూట్ కోసమే నగరానికి వచ్చినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది.

## టికెట్ ధరలు తగ్గిన ఉస్తాద్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన మాస్ ఎంటర్టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ మూవీ ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. విడుదలైన మొదటి రోజునుంచే ఈ సినిమా మంచి స్పందనను అందుకుంటూ, ముఖ్యంగా వీకెండ్‌లో రెండు తెలుగు రాష్ట్రాల్లో సాలిడ్ కలెక్షన్లను రాబడుతోంది. సినిమాలో మాస్ ఎలిమెంట్స్, పవన్ కళ్యాణ్ స్టైల్ యాక్షన్, ఎంటర్టైనింగ్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఈ సినిమాకు టికెట్ ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఈ ధరల పెంపు సాధారణ ప్రేక్షకులపై, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌పై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. టికెట్ రేట్లు ఎక్కువగా ఉండటంతో కొంతమంది ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి వెనుకంజ వేస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ టికెట్ ధరలతోనే సినిమా ప్రదర్శించనున్నట్లు ప్రకటించింది.



# పంజాబ్ ఓటములకు కారణమదే

*గతంలో పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ యాజమాన్యంలో తలెత్తిన వివాదాల కారణంగానే ఇన్నేళ్లుగా వెనుకబడిపోయిందని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు. పంజాబ్ కింగ్స్‌లో తెరవెనుక పరిస్థితులు ఎప్పుడూ సాఫీగా సాగలేదని, ఏదో ఒక విషయంలో లుకలుకలు తలెత్తేవని తెలిపాడు.*




'2008 తొలి సీజన్‌లో యువరాజ్ సింగ్ నేతృత్వంలోని పంజాబ్ ప్లేఆఫ్స్‌కు చేరింది. తొలి సీజన్ తర్వాత పంజాబ్ క్రమంగా తమ పట్టును కోల్పోయింది. తొలి సీజన్ తర్వాత కెప్టెన్సీ కొనసాగాల్సింది. కానీ మూడో ఏడాదికే కెప్టెన్సీ మారిపోయింది. అదే వివాదాలకు దారి తీసింది. యాజమానులు, కోచ్‌లు ఇద్దరూ క్రికెట్‌పై కనీస అవగాహన లేనివారు కావడంతో నిర్ణయాల్లో తేడాలు వచ్చాయి. ఒక యజమాని ఒక టీమ్ కాంబినేషన్ కోరుకుంటే, మరొకరు ఇంకో ప్లాన్ చెప్పడంతో జట్టులో గందరగోళం ఏర్పడేది' అని తెలిపాడు. నిజానికి పంజాబ్ కింగ్స్ యాజమాన్యంలో ప్రీతిజింటా ఎక్కువ వాటా ఉన్నప్పటికీ, మోహిత్ బర్మన్, నెస్ వాడియా, కరణ్ పాల్ కూడా జట్టులో భాగస్వాములుగా కొనసాగుతున్నారు. ఈ పార్టనర్ల మధ్య సమన్వయం లేకపోవడంతో అది ప్రదర్శనపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. 18 ఏళ్లలో పంజాబ్ కింగ్స్‌కు 12 మంది కెప్టెన్లు మారడంతో జట్టుపై నమ్మకం తగ్గిపోయింది. ఇప్పుడు అది జట్టుపైనే ప్రభావం చూపిస్తుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం మార్పు కనిపిస్తున్నట్లుగా ఉంది. శ్రేయస్ అయ్యర్ పంజాబ్‌ను సరైన దిశలో నడిపిస్తాడనే నమ్మకం కలుగుతోంది.



## 2000-3000 పరుగులు చేస్తా

ఐపీఎల్ తాజా సీజన్‌లో సత్తాచాటేందుకు వైభవ్ సూర్యవంశీ సిద్ధం అవుతున్నాడు. ఈ నేపథ్యంలో 14 ఏళ్ల వైభవ్ తన సహచర ఆటగాళ్లతో కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా వైభవ్‌కు రిపోర్టర్ నుంచి ఓ ప్రశ్న ఎదురైంది. ఐపీఎల్ 2026 కోసం మీ ప్లాన్స్ ఏంటి? ఆరెంజ్ క్యాప్ కోసం ఎన్ని పరుగులు చేయాలనుకుంటున్నారు? అని సదరు విలేఖరి ప్రశ్నించాడు. అందుకు వైభవ్ నవ్వుతూ.. 'మీరు నన్ను ఇలాంటి ప్రశ్నలు అడిగితే, రెండు నుండి మూడు వేల పరుగులు చేస్తానని చెబుతా' అని బదులిచ్చాడు. దీంతో అక్కడ ఉన్నవారంతా ఒక్కసారిగా నవ్వారు. ఇందుకు సంబంధించిన వీడియోను రాజస్తాన్ రాయల్స్ ఎక్స్‌లో షేర్ చేసింది. అయితే ఇదే ప్రశ్నకు వైభవ్ తర్వాత సీరియస్‌గా సమాధనమిచ్చాడు. 'నేను ఇన్ని పరుగులు చేయాలని ఒక టార్గెట్ పెట్టుకోలేదు. నేను సహజశైలిలోనే బ్యాటింగ్ చేస్తాను. నా వ్యక్తిగత మైలురాయిల కంటే జట్టుకు ట్రోఫీ అందించడమే నా ప్రధాన లక్ష్యం' అని అతడు చెప్పుకొచ్చాడు.




## కోహ్లీ కోసం లండన్‌కు చార్టెడ్ ఫ్లైట్..?

లండన్‌ను తన రెండో ఇల్లుగా మార్చుకున్న విరాట్ కోహ్లీ వన్డేలుంటే తప్ప భారత్‌కు రావడం లేదు. కుటుంబంతో అక్కడే స్థిరపడిన కోహ్లీ ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్క్వాడ్‌తో కలిశాడు. ప్రాక్టీస్ సెషన్‌లో సహచరుల్లో స్ఫూర్తి నింపిన విరాట్.. తాను సీజన్ మధ్యలో లండన్‌కు చార్టర్ ఫ్లయిట్ డిమాండ్ చేశాననే వార్తల్ని కొట్టిపారేశాడు. ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ నవ్వుతున్న ఎమోజీలు పోస్ట్‌తో అవన్నీ వదంతులే అని తేల్చేశాడీ ఆర్సీబీ మాజీ సారథి. ఆర్సీబీ మ్యాచ్‌లకు మూడు రోజుల విరామం లభిస్తే లండన్ వెళ్లాలని అతడు భావిస్తున్నాడు. మరుసటి మ్యాచ్‌కు ముందురోజు భారత్‌కు వచ్చేలా ప్లాన్ చేసుకుంటున్నాడు అని కొన్ని కథనాలు వచ్చాయి. ఈ వార్తలను చూసి నవ్వుకున్న కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో రెండు లాఫింగ్ ఎమోజీస్ పెట్టాడు. తద్వారా తానేమీ చార్టర్ ఫ్లయిట్ కోరలేదని, ఎవరో పనిగట్టుకుని తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారని కోహ్లీ చెప్పకనే చెప్పాడు. ఇలాంటి వార్తలు ఎలా క్రియేట్ చేస్తార్రా? అన్నట్లు ఫేస్ ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడు.



## బంగ్లా పర్యటనకు టీమిండియా!?

భారత్-బంగ్లాదేశ్ మధ్య క్రికెట్ సంబంధాలు మెరుగుపడుతున్నాయా? ఈ ఏడాది ఆగస్టులో బంగ్లా పర్యటనకు టీమిండియా వెళ్లనుందా? అంటే అవునానే సమాధానం వినిపిస్తోంది. భారత్-బంగ్లాదేశ్ వైట్ బాల్ సిరీస్ షెడ్యూల్ ప్రకారం జరగనున్నట్లు బంగ్లా క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. అయితే ఆగస్టులో కాకుండా ఈ సిరీస్‌లో సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. 'భారత్ పర్యటను సెప్టెంబర్‌కు ఐర్లాండ్ సిరీస్‌ను మరో విండోలో నిర్వహించాలని కోరాం. కానీ వారి బీజీ షెడ్యూల్ కారణంగా అది సాధ్యపడలేదు. అందుకే ఐరీష్ పర్యటనను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నామని' ఓ బీసీబీ సీనియర్ అధికారి క్రిక్‌బజ్‌తో పేర్కొన్నారు. అయితే భారత క్రికెట్ బోర్డు నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## ఈసారి ముంబైదే కప్: రోహిత్ శర్మ




ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు ముంబై ఇండియన్స్ క్యాంపులో జోష్ నెలకొంది. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్,హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ముంబై అభిమానులకు బంపర్ ఆఫర్ ఇచ్చాడు. ఈ సారి ఎలాగైనా ఆరో ఐపీఎల్ ట్రోఫీని ముంబైకి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశాడు. ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్‌లో నిర్వహించిన 'ద మిక్స్' అనే ప్రత్యేక కార్యక్రమంలో రోహిత్ శర్మ ఈ కామెంట్స్ చేశాడు. ప్లేయర్లు, కోచ్‌లు, జట్టు యాజమాన్యం, అభిమానులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రోహిత్ శర్మ మాట్లాడుతూ.. 'మేము కచ్చితంగా మీ అందరి కోసం ఆరో ట్రోఫీని గెలుచేందుకు మా శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాం' అని రోహిత్ శర్మ ప్రకటించాడు.




## మెక్‌కల్లమ్‌పై విమర్శలు!




ఇంగ్లండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. మెక్‌కలమ్ పర్యవేక్షణలో ఇంగ్లండ్ క్రికెట్ జట్టు గాడి తప్పిందని, ఆటగాళ్లకు క్రమశిక్షణ లోపించిందని తెలుస్తోంది. డ్రెస్సింగ్ రూమ్‌లో మద్యం తాగుతూ.. సిగరెట్‌లు పీల్చారని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) తమ విచారణలో గుర్తించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌లో ఎదురైన ఘోర పరాజయంపై ఈసీబీ సమీక్ష నిర్వహించింది. ఈ సమీక్షలో.. హెడ్ కోచ్ మెక్‌కలమ్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు వెల్లడైంది. మైదానం బయటి వివాదాలు అతనిపై ఆరోపణలకు ఆజ్యం పోస్తున్నాయి. యాషెస్ సిరీస్ మధ్యలో తొమ్మిది రోజులు విశ్రాంతి రాగా.. పలువురు ఆటగాళ్లు ఆరు రోజుల పాటు మద్యం తాగుతూ జట్టుకు దూరంగా గడిపినట్లు తెలుస్తోంది. న్యూజిలాండ్‌తో సిరీస్ సమయంలోనూ అర్ధరాత్రి నైట్‌క్లబ్ బౌన్సర్‌తో బ్రూక్ వాగ్వాదానికి దిగడం తీవ్ర దుమారం రేపింది. కొందరు ఆటగాళు తరుచూ క్యాసినోకు వెళ్లారని, యాషెస్‌లో జట్టు పేలవ ప్రదర్శనకు ఇదీ ఓ కారణమని ఈసీబీ నిర్వహించిన సమీక్షకు సంబంధించిన నివేదికలో పేర్కొన్నారు.

## కివీస్‌దే టీ20 సిరీస్

### నాలుగో టీ20లో సౌతాఫ్రికా చిత్తు

వెల్లింగ్టన్ వేదికగా దక్షిణాఫ్రికాతో మహిళలతో జరిగిన నాలుగో టీ20లో న్యూజిలాండ్ ఉమెన్స్ టీమ్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1తో న్యూజిలాండ్ సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ప్రోటీస్ ఆల్‌రౌండర్ అనేరీ డెర్క్సెన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 32 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 55 పరుగులు చేసింది. ఆమెతో పాటు లాస్ 30 పరుగులతో రాణించింది. న్యూజిలాండ్ బౌలర్లలో జెస్ కెర్ 3 వికెట్లతో అదరగొట్టింది. అనంతరం 160 పరుగుల లక్ష్యాన్ని కివీస్ జట్టు 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కివీస్ స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ డివైన్ మరోసారి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 34 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 పరుగులు చేసింది. ఆమెతో పాటు అమీలియా కేర్ 31 పరుగులతో రాణించింది. సౌతాఫ్రికా బౌలర్లలో క్లో ట్రయాన్ 2 వికెట్లు తీసింది. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రపు ఐదో టీ20 క్రైస్ట్‌చర్చ్ వేదికగా మార్చి 25న జరగనుంది.




## ఐపీఎల్ కోసం పీసీఎల్‌కు శనక గుడ్‌బై!

ప్రపంచంలోనే పాపులర్ టీ20 లీగ్‌గా పేరొందిన ఐపీఎల్ కోసం పలువురు క్రికెటర్లు పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను వీడుతున్నారు. ఇప్పటికే జింబాబ్వే ఆటగాడు బ్లెస్సింగ్ ముజరబాని పీఎస్‌ఎల్‌కు గుడ్ బై చెప్పేసి కోల్‌కతా నైట్ రైడర్స్ స్క్వాడ్‌లో చేరగా.. శ్రీలంక కెప్టెన్ దసున్ శనక సైతం పీఎస్‌ఎల్ నుంచి వైదొలగనున్నాడు. ఇటీవల పొట్టి ప్రపంచకప్‌లో చెలరేగిన శనకతో రాజస్థాన్ రాయల్స్ ఒప్పందం చేసుకోనుంది. ఆల్‌రౌండరైన శనకను కొనేందుకు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ సిద్ధంగా ఉంది. గాయపడిన ఆల్‌రౌండర్ సామ్ కరన్ స్థానంలో శనకను తీసుకోవాలని ఫ్రాంచైజీ పావులు కదుపుతోంది. ఇదే విషయంపై ప్రశ్నించగా అవును. మేము శనకతో ఒప్పందం చేసుకోబోతున్నాం. కొన్ని అంశాలు పూర్తి కావాల్సి ఉంది. అతడు శ్రీలంక క్రికెట్‌కు కొన్ని పేపర్లు సమర్పించాల్సి ఉంది అని రాజస్థాన్ రాయల్స్ అధికారి ఒకరు క్రిక్‌బజ్‌తో వెల్లడించాడు. నిరుడు అబుధాబీలో జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో దసున్ శనకను కొనేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించలేదు. కానీ, ఇటీవల ప్రపంచకప్‌లో చెలరేగిన అతడితో పీఎస్‌ఎల్ ఫ్రాంచైజీ లాహోర్ క్యాలండర్స్ పాక్ కరెన్సీలో రూ.75 లక్షలకు కొన్నది. అయితే.. శనక ఐపీఎల్ ఆడాలని నిర్ణయించుకున్నందున పీఎస్‌ఎల్ కాంట్రాక్ట్ ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భావిస్తోంది.

ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 23-3-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

## శాంతి మార్గంలో భారత్ దౌత్యం

**పశ్చిమాసియాలో** ముదురుతున్న యుద్ధ మేఘాలను అదుపు చేసేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న దౌత్యపరమైన కృషి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రపంచం మరో పెను ప్రమాదపు అంచున నిలబడిన వేళ, భారత్ తనదైన శైలిలో శాంతి దూతగా వ్యవహరిస్తోంది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య సాగుతున్న భీకర దాడులు కేవలం ఆ ప్రాంతానికే కాకుండా, యావత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా పరిణమించాయి. ఈ క్లిష్ట సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా రంగంలోకి దిగి, ఇరాన్ అధ్యక్షుడితో చర్చలు జరపడం, ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టడం అభినందించదగ్గ పరిణామం. యుద్ధం ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదని, చర్చలు - దౌత్యం ద్వారానే సంక్షోభాల నుంచి బయటపడగలమని భారత్ మొదటి నుంచీ గట్టిగా నమ్ముతోంది. శనివారం ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ జరిపిన ఫోన్ సంభాషణలో ఇదే ప్రధానాంశంగా నిలిచింది. మౌలిక సదుపాయాలపై దాడులను ఖండిస్తూనే, పశ్చిమాసియాలో స్థిరత్వం నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. భారత్ తన ఇంధన అవసరాల కోసం గల్ఫ్ దేశాలపైనే అధికంగా ఆధారపడుతోంది. యుద్ధం వల్ల సరఫరా గొలుసు దెబ్బతింటే అది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇరాన్, గల్ఫ్ ప్రాంతాలలో లక్షలాది మంది భారతీయులు నివసిస్తున్నారు. వారి క్షేమం కోసం భారత్ ఇరాన్ ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటోంది. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హోర్ముజ్ జలసంధి వంటి నౌకామార్గాలు సురక్షితంగా ఉండాలని భారత్ పట్టుబడుతోంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ వంటి విరుద్ధ శక్తులతో సమానమైన స్నేహ సంబంధాలు కలిగిన దేశం భారత్ మాత్రమే. యూఏఈ మాజీ రాయబారి వంటి ప్రముఖులు కూడా ప్రధాని మోదీ ఒక ఫోన్ కాల్ చేస్తే యుద్ధం ఆగే అవకాశం ఉందని పేర్కొనడం భారత్ యొక్క పెరుగుతున్న ప్రాధాన్యానికి నిదర్శనం. కేవలం సొంత ప్రయోజనాలకే పరిమితం కాకుండా, ప్రపంచ శాంతి కోసం భారత్ వహిస్తున్న చొరవ అది 'విశ్వగురువు'గా ఎదగడానికి తోడ్పడుతోంది. ఉక్రెయిన్ సంక్షోభమైనా, పశ్చిమాసియా యుద్ధమైనా.. 'ఇది యుద్ధాల యుగం కాదు' అనే మోదీ నినాదాన్ని భారత్ ఆచరణలో చూపిస్తోంది. అన్ని పక్షాలు సంయమనం పాటించి, ఆయుధాలను విడనాడి చర్చల వైపు మళ్లేలా చేయడంలో భారత్ దౌత్యం సఫలమవ్వాలి.

# రాయుల వారి కిష్కింధ

సుగ్రీవుడికీ, కృష్ణదేవరాయలకూ లింకేమిటి?
రాయల రాజ్యానికి, కిష్కింధకు ఉన్న సంబంధం ఏమిటి?
రాయల రాజ్యాన్ని స్థాపించింది వాలి సుగ్రీవులేనా?
రాముడికి సాయం చేసింది ఆంధ్రులేనా?

శ్రీకృష్ణదేవరాయలు.. సాహితీ సమరాంగణ సార్వభౌముడు... విజయనగర సామ్రాజ్య కీర్తి పతాక. రాయల వారికీ, వానరులకూ ఓ లింక్ ఉంది తెలుసా? రామాయణ కాలం వాటి సుగ్రీవుడికీ, కృష్ణదేవరాయలకూ మధ్య విడదీయరాని ఓ అనుబంధం ఉంది. వేల సంవత్సరాల క్రితం నాటి రామాయణ కాలంలోని కిష్కింధ ఎక్కడ? 16శతాబ్దం నాటి విజయనగర సామ్రాజ్యం ఎక్కడ? ఈ రెంటికీ పొంతన ఎలా కుదురుతుంది? అనుకోవచ్చు. సహజమే. కిష్కింధను ఏలింది వానరులు.. విజయనగరాన్ని పరిపాలించింది నరచక్రవర్తులు. కానీ, చరిత్ర మరువని సంబంధం విజయనగర మూలాల్లో దాగి ఉంది. రాయల వారి రాజ్యానికీ, వానర సామ్రాజ్యానికీ తల్లివేరు ఒకటే. అంతే కాదు... వాలి, సుగ్రీవులు వానర రాజులు. కిష్కింధ సామ్రాజ్యాధినేతలు.



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 9052116463

రాముడికి బలం వానరులు. రావణ సంహార సారథికి వారివే అండదండలు. సీతమ్మ జాడను కనుగొన్నది వారు. వారధి కట్టి లంకకు చేటు తెచ్చిందీ వారు. ఇంతకీ ఈ వానరులు ఎవరు? ఎక్కడి వారు? ఆంధ్రులేనా? రాముడికి సాయం చేసింది తెలుగువారేనా? ఒకటి రాయలవారి సామ్రాజ్యపు మూలం కిష్కింధలో ఉందనేది.. రెండు వానరులు ఆంధ్రులేనన్నది. ఈ రెంటికీ లంకె ఉంది. వానరులకూ, కృష్ణదేవరాయలకూ విడదీయరాని సంబంధం ఉంది. సుగ్రీవుడి నుంచి రాయలవారి దాకా రాచరికపు అనుబంధం కొనసాగింది. త్రేతాయుగంలో వానరులు, కలియుగంలో కృష్ణరాయలు ఇద్దరి మధ్యా ఎలా లంకె పడింది అనుకోవచ్చు. కానీ, విజయ నగర సామ్రాజ్యానికి కిష్కింధే మూలం. కిష్కింధకూ, రాయలకూ ముడిపెట్టడమేమిటి? దీని వెనుక లాజిక్కేమిటి? సహజంగానే వచ్చే ప్రశ్నే ఇది.. కానీ, ఇది నిజం.. కిష్కింధ నుంచి హంపి దాకా అవిచ్ఛిన్నంగా నాగరికతా ప్రస్థానం సాగింది. రాయలేలిన సీమకు, సుగ్రీవ రాజ్యానికి మూలాలు ఒకే చోట ఉన్నాయి. ఒకటిగా ఉన్నాయి. కోదండరాముడు విశ్రమించిన రుష్యమూకమే.. విజయనగరానికి కేంద్రస్థానంగా నిలిచింది. చరిత్ర మరచిన సత్యమిది.. రామాయణం నుంచి రాయల కాలం దాకా అవిచ్ఛిన్నంగా సాగిన జాతి మూలాలివి.

రావణుడు సీతమ్మను ఎత్తుకెళ్లిన తరువాత ఆమె జాడను వెతుక్కుంటూ వెళ్లిన రామలక్ష్మణులను రుష్యమూకం వద్ద హనుమంతుడు కలిసాడు. అక్కడి నుంచి సుగ్రీవుడితో స్నేహం కుదిరింది.. అప్పటికే వాలిసుగ్రీవుల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. వాలిని చెట్టుచాటు నుంచి సంహరించి సుగ్రీవుడికి పట్టం కట్టిన వాడు రాముడు. ఆ తరువాత వానర సేన కిష్కింధ నుంచి బయలుదేరి సీతాన్వేషణ చేపట్టింది. లంకలో సీతమ్మను కనుగొన్న తరువాత రాముడితో కలిసి వానరసేన లంకకు చేరుకుని మహారాక్షస సంహార కార్యక్రమాన్ని పూర్తి చేసింది. ఆ తరువాత తిరిగి కిష్కింధకు చేరుకుని రామరాజ్యంలో వానరులు గడిపారు. రామాయణంలో కిష్కింధకున్న ప్రాధాన్యం ఇది. అంతమాత్రం చేత విజయనగర సామ్రాజ్యానికి, కిష్కింధకూ సంబంధంలేదని అనుకోలేం. ఎందుకంటే 16వ శతాబ్దంలో రాయలేలిన రతనాలసీమే రామాయణ కాలం నాటి కిష్కింధ. విజయనగర సామ్రాజ్య వైభవాన్ని ఇవాళ చాటుతున్న హంపీయే నాటి కిష్కింధ సామ్రాజ్యానికీ రాజధాని. చిత్తూరు నుంచి బళ్లారి-హంపి దాకా విస్తరించిన సామ్రాజ్యం కిష్కింధ. వేల సంవత్సరాల తరువాత తెలుగుజాతి కీర్తిపతాకను విశ్వవ్యాప్తం చేసిన రాయల రాజ్యానికి మూల వ్యవస్థ.

కృష్ణదేవరాయల కాలంలో స్వర్ణయుగాన్ని అనుభవించిన ప్రాంతం అంతా నాటి కిష్కింధ సామ్రాజ్యంలో భాగమే. సాంకేతికంగా రుజువైన వాస్తవం. రామాయణ కాలం నాటి నుంచీ రాయలకాలం దాకా కూడా ఇది రక్షణాత్మకంగా, వ్యూహాత్మక స్థావరంగా కొనసాగింది. రాముడు రావణుడిపై ఇక్కడి నుంచే యుద్ధవ్యూహం రచించాడు. రాయల యుద్ధ పిపాస కూడా ఈ విజయనగరం కేంద్రంగానే సాగింది. విజయనగర శిథిలాలను మాత్రమే కాదు, రామాయణ కాలం నాటి అనేక ఆనవాళ్లను మనం ఇక్కడ రుజువులతో సహా చూడవచ్చు. అయోధ్య నుంచి లంక దాకా రాముడు ప్రయాణం చేసిన ప్రాంతం అంతటా ఆయన గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కిష్కింధ ఇందుకు ఉదాహరణ. నాడు దండకారణ్యంలో భాగంగా ఉన్న కిష్కింధ ఇవాళి దక్షిణ కన్నడ రాజ్యంలో హంపిగా కనిపిస్తోంది. ఈ రాజ్యాన్నే నాడు సుగ్రీవుడు ఏలుకున్నాడు. ఆ తరువాత ఇదే ప్రాంతంలో కాకతీయుల పతనానంతరం హరిహర రాయలు, బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఆ సామ్రాజ్యపు వారసుడే రాయలు. వాలి.. సుగ్రీవుడి అన్న.. ఇద్దరూ మంచి సోదరులే. ఓ రోజు వాలితో యుద్ధానికి దుందుభి అనే రాక్షసుడు అర్ధరాత్రి వస్తాడు.. అతణ్ణి తరుముతూ వెళ్లిన వాలి ఓ గుహలోకి వెళ్తాడు.. దాదాపు సంవత్సరం పాటు గుహలో యుద్ధం జరిగింది. ఇది రామాయణంలో జరిగిన కథ.. ఈ గుహను మనం ఇవాళికీ చూడవచ్చు. ఈ గుహలో ఒక శివలింగం కూడా కనిపిస్తుంది. ఈ శివలింగాన్ని అంతకు ముందు భస్మాసురుడు ప్రతిష్ఠించినట్లు మరో కథ ప్రచారంలో ఉంది.

ఏడాదైనా అన్న తిరిగి రాలేదనుకున్న సుగ్రీవుడు పట్టాభిషేకం చేసుకున్నాడు. అదే సమయానికి తిరిగి వచ్చిన వాలి అతణ్ణి తరిమేసేసరికి రుష్యమూక పర్వతంపైకి వెళ్లి దాక్కున్నాడు. ఆ రుష్యమూకం పంపాసరోవర తీరంలో ఉంది. ఈ సరోవరం వద్దే సీతమ్మవారి నగలు ఆంజనేయుడికి లభించాయి. రుష్యమూకానికి సమీపంలోనే అంజనగిరి కూడా ఉంది.. కిష్కింధలో ఆంజనేయుడి నివాసమిది. తుంగభద్రానదికి ఉత్తర తీరంలోనే ఈ పర్వతం ఉంది. ఈ పర్వతంపై హనుమంతుడి గుడి కూడా ఉన్నది. అంజనగిరికి మరోవైపు మాల్యవంత పర్వతం ఉంది. సుగ్రీవుడితో స్నేహం తరువాత సీత జాడ తెలిసేంతవరకూ ఆయన ఈ పర్వతంపైనే ఉన్నాడు.. ఇప్పుడీ హిల్స్పైన అత్యద్భుతమైన రఘునాథ రాముడి దేవాలయం కనిపిస్తుంది. కిష్కింధలో రాముడు వాలిని చంపిన ప్రదేశాన్ని కూడా మనం చూడవచ్చు. రుష్యమూ కానికి కొద్ది దూరంలోనే నింబాపురం అనే గ్రామం ఉంది. ఈ గ్రామంలోనే వాలిని రాముడు సంహరించాడు. దీని ఆనవాళ్లు కూడా మనకు ఇక్కడ కనిపిస్తాయి. ఈ గ్రామంలోని కొండపై రామచంద్రుడి పాదాలు వున్నాయి. ఈ పర్వతం చూడటానికి చాలా టిపికల్గా కనిపిస్తుంది. ఇక్కడే వాలి సుగ్రీవుల మధ్య యుద్ధం జరిగింది. ఇక్కడే చెట్టు చాటు నుంచి వాలిని రాముడు చంపాడని స్థానికుల విశ్వాసం. రామాయణ కాలం తరువాత హంపిలో మొట్టమొదటి ప్రాచీన ఆనవాళ్లు ఫస్ట్ సెంచరీకి ముందు మనకు కనిపిస్తాయి. ఇక్కడ పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో వేల సంవత్సరాల నాటి శిథిలాలు చాలా వెలుగు చూశాయి. చిత్తూరు నుంచి హంపి వరకు వానర సామ్రాజ్యం విస్తరించిన గుర్తులు మనకు కనిపిస్తున్నాయి. తిరుమల ఏడు కొండల్లో అంజనాద్రి పర్వతం హనుమంతుడి జన్మస్థలంగా భావిస్తున్నారు. అక్కడి నుంచి వానరజాతి కిష్కింధ దాకా విస్తరించిందని ఒక అభిప్రాయం. సీతను వెతకటానికి ఒక వానర బృందాన్ని తూర్పు వైపు పంపించాడు సుగ్రీవుడు. తూర్పున చివరంటా వెతికి రావాలని ఆదేశించాడు. హంపి సమీపంలోని కిష్కింధలో ఉన్న ఉదయ పర్వతంపై బంగారు రంగులో మూడు కొమ్మలున్న తాళ వృక్షాన్ని చూసినట్టుగా శిల్పం కనిపిస్తుంది. దక్షిణ అమెరికాలోని పిస్కో తీరంలోని అండెస్ పర్వతంపై ఇలాంటి వృక్షం బయట పడటం రామాయణపు చరిత్రను నిరూపిస్తున్నది. ఇది 820 అడుగుల ఎత్తులో ఉంది.





వానరులు దక్షిణ భారతంలో నివసించిన ఒక ట్రైబల్ జాతి. అంతా అనుకుంటున్నట్లు వానరులు అంటే కోతులు ఎంతమాత్రం కాదు. వీళ్లు మనుషులే.. కాకపోతే వీరికి తోక ఒకటి ఉండేదని అందువల్లే వీళ్లను 'వా'నరులని పిలిచేవారంటారు. దక్షిణాపథాన వీళ్లది ప్రధాన రాజ్యం. త్రేతాయుగం నుంచి ద్వాపర యుగం దాకా కొనసాగిన సుదీర్ఘ రాజ్య వ్యవస్థ కిష్కింధ మాత్రమే. మహాభారత కాలంలో పాండవుల్లో చివరివాడైన సహదేవుడు కిష్కింధకు వచ్చి వెళ్లాడు. అదే సమయంలో దండకారణ్యంలో రెండు రాజ్యాలుగా ఉన్న ఆంధక, తెలింగలను జయించాడు. కిష్కింధ ఒక బలమైన రాచరిక వ్యవస్థకు పునాది కనుకనే మన కాలంలో దానికి పునర్వైభవం కలిగింది. ఆనాటి స్వర్ణయుగాన్ని దాదాపు మూడు వందల సంవత్సరాల పాటు విజయనగర సామ్రాజ్యలక్ష్మి తిరిగి అందించింది. కృష్ణదేవరాయల కాలం రత్నాలు రాసులుగా పోసి వీధుల్లో అమ్మిన మహాయుగం. నాటి కిష్కింధే.. రాయల విజయనగరం.. మనకు హంపి. ఇవాల్టి కన్నడ రాజ్యంలో ఉన్న నాటి మన తెలుగు నగరి బళ్లారి... కిష్కింధ నుంచి హంపి దాకా సాగిన భారత జాతి నాగరికతా ప్రస్థానం ఇది. మన జాతి మూలాలను పదిలపరచుకున్న పవిత్ర ప్రాంతం కిష్కింధ. సుగ్రీవుడి నుంచి కృష్ణరాయల దాకా అపూర్వమైన చారిత్రక వైభవాన్ని తెలుగువారికి అందించిన నగరం హంపి.. మన మౌలిక మూలాలలో బలమైన మూలం కిష్కింధ.. దక్షిణాపథాన అసమాన సామ్రాజ్య వైభవ చిహ్నం కిష్కింధ. దానికి మరోపేరే విజయనగరం.. ఇంకోపేరు హంపి.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.